మంగళవారం
10-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 110
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇజ్రాయిల్‌కు సాయం చేయొద్దు

అమెరికాలో పలస్తీనా అనుకూల ప్రదర్శనలు

ఇజ్రాయిల్-హామాస్ మధ్య సైనిక ఘర్షణల క్రమంలో పలస్తీనాకు మద్దతు పెరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా పలస్తీనా ప్రజల పోరాటానికి సంఘీభావం లభిస్తోంది. పలస్తీనాకు సంఘీభావ ఉద్యమానికి ఈరోజు చరిత్రాత్మక దినం. ది ఆన్సర్ కోయిలేషన్‌తో పాటు మరికొన్ని సంఘాల అధ్వర్యంలో అమెరికా వ్యాప్తంగా సోమవారం భారీ ఎత్తున ప్రదర్శనలు జరిగాయి.

2 లో

వైసీపీ సన్నద్ధం

ఫిబ్రవరిలో మేనిఫెస్టో

- మరో నాలుగు కీలక కార్యక్రమాలు వెల్లడించిన జగన్
- ఇప్పటికే ప్రారంభమైన 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- నవంబరు 1 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్'
- ఈనెల 25 నుంచి 60 రోజుల బస్సు యాత్ర
- డిసెంబరు 11 నుంచి జనవరి 15 వరకు 'ఆడుదాం-ఆంధ్రా'
- వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వైసీపీ మేనిఫెస్టోను విడుదల చేస్తామని, ఎన్నికలకు పార్టీ శ్రేణులంతా సన్నద్ధం కావాలని వైసీపీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధమని నొక్కి చెప్పారు. వై నాట్ 175/175 గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని, అందులో మండల స్థాయి ప్రతినిధులు కీలక భూమిక పోషించాలన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం వైసీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. దీనికి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మండలాల పార్టీ ప్రతినిధులు 8 వేల మందికి పైగా హాజరయ్యారు. వారితో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, ప్రాంతీయ

- మిగతా 2 లో

చంద్రబాబు అరెస్ట్‌లో కక్ష సాధింపు లేదు

- ప్రజలతోనే మా పొత్తు
- వైసీపీ విస్తృత స్థాయి సమావేశంలో జగన్ కీలక వ్యాఖ్యలు

2 లో

ఎన్నికలకు వేళాయె

- తెలంగాణ, మిజోరం, మధ్యప్రదేశ్, రాజస్తాన్, చత్తీస్‌గఢ్‌లో
- నవంబరు 7-30 తేదీల్లో పోలింగ్
- డిసెంబరు 3న ఓట్ల లెక్కింపు
- ఎన్నికల సంఘం ప్రకటన

న్యూదిల్లీ: ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగబోతున్న క్రమంలో సెమీ ఫినాలేగా భావించే అసెంబ్లీ ఎన్నికల తేదీల కోసం నిరీక్షణ ముగిసింది. చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో ఎన్నికల షెడ్యూల్ సోమవారం విడుదలైంది. నవంబరు 7 నుంచి 30వ తేదీ వరకు ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగబోతున్నట్లు తెలిపింది. చత్తీస్‌గఢ్‌లో మాత్రమే రెండు దశల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఓట్ల లెక్కింపు డిసెంబరు 3న జరుగుతుందని పేర్కొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ సోమవారం విలేకరుల సమావేశంలో ఎన్నికల గురించి వివరాలను తెలిపారు. మిజోరంలో నవంబరు 7న, మధ్యప్రదేశ్‌లో 17న, రాజస్తాన్‌లో 23న, తెలంగాణలో 30వ తేదీన ఎన్నికలు ఒకే దశలో జరుగుతాయని, చత్తీస్‌గఢ్‌కు మాత్రం

- మిగతా 2 లో

ఐదు రాష్ట్రాల్లో బీజేపీదే అధికారం: నడ్డా

న్యూదిల్లీ: ఐదు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందన్న దీమాను ఆ పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా వ్యక్తంచేశారు. అఖండ మెజారిటీ సాధించి ఐదు రాష్ట్రాల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్తాన్, తెలంగాణ, మిజోరం ఎన్నికల ప్రకటన నంతరం ఎక్స్ మాధ్యమంగా నడ్డా స్పందించారు. 'అన్ని రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కానుంది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారీ మెజారిటీని సాధించబోతోంది. వచ్చే ఐదేళ్ల కోసం ప్రజాకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు కట్టుబడి ఉంది' అని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ, దాని మిత్రపక్షాలు ఇంటికే: ఖడ్గే

న్యూదిల్లీ: బీజేపీ, దాని మిత్రపక్షాలను ఇంటికి పంపే తేదీలు ఖరారయ్యాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే వ్యాఖ్యానించారు. మరింత బలంగా ప్రజల్లోకి వెళతామని ప్రకటించారు. ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, ప్రగతిశీల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ హామీనిస్తుందని తెలిపారు. 'ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలకు ప్రకటన వెలువడింది. దీంతో బీజేపీ, దాని మిత్రపక్షాలను ఇంటి పంపే తేదీలు ప్రకటించినట్లు అయింది. చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, మిజోరంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ప్రజల్లోకి వెళుతుందని ఖడ్గే ట్వీట్ చేశారు.

సిద్ధాంతాల మధ్య పోరు: చౌహాన్

భోపాల్: రానున్న అసెంబ్లీ ఎన్నికలను సిద్ధాంతాల మధ్య పోరాటంగా మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అభివర్ణించారు. పెద్దసంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ వ్యతిరేకత, బీజేపీపై అసంతృప్తి ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో అందరూ ఓటు వేయాలని చౌహాన్ పిలుపునిచ్చారు. 'ప్రజాస్వామ్యానికి ఎన్నికలు పెద్ద పండుగ. అత్యంత ఉత్సాహంతో ఎన్నికల్లో భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఎన్నికలు ప్రభుత్వాలను ఏర్పాటు చేయడానికి మాత్రమే కాదు...ప్రజలు, రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయిస్తాయి' అని చౌహాన్ చెప్పారు.

చంద్రబాబుకు నిరాశ

- ఏ కోర్టులోనూ దక్కని ఊరట
- ముందస్తు బెయిల్ పిటిషన్లు తిరస్కరించిన హైకోర్టు
- ఏసీబీ కోర్టులోనూ కస్టడీ, బెయిల్ పిటిషన్లు డిస్మిస్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన మూడు ముందస్తు బెయిల్ పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఫైబర్‌నెట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్లు కేసుల్లో దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై సోమవారం

- మిగతా 2 లో

ప్రాజెక్టులపై చిత్తశుద్ధి కరువు

- రూ.10 కోట్లతో గేటు మరమ్మతు చేయలేరా?
- జగన్ చేతకాని పాలనతో రాష్ట్రానికి నష్టం
- గుండ్లకమ్మ రైతుల పాదయాత్ర ముగింపు సభలో రామకృష్ణ

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్రంలో సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను, మరమ్మతులను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ప్రకాశం జిల్లాలో గుండ్లకమ్మ ఆయకట్టు రైతు సంఘం అధ్వర్యంలో ఏడాది క్రితం వరదలకు కొట్టుకుపోయిన గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడో నెంబర్ గేటును వెంటనే నిర్మించాలని, మధ్యలో వదిలేసిన కాలువ పనులు పూర్తి చేయాలని, కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉంటున్న తూటు, జమ్మూ, చిల్ల చెట్లను వెంటనే తొలగించి ఆయకట్టి చివరి భూముల వరకు సాగునీరు ఇవ్వాలని, ఒంగోలు, అద్దంకి పట్టణాలకు తాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5వ తేదీన ప్రారంభమైన పాదయాత్ర ఎనిమిదో తేదీ వరకు కొనసాగింది. పాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం ఒంగోలులోని అద్దంకి బస్టాండ్ సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, అనంతరం నిరసన సభ నిర్వహించారు. సభకు గుండ్లకమ్మ ఆయకట్టు రైతుసంఘం ప్రధాన కార్యదర్శి వడ్డె హనుమరెడ్డి అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ రెండు లక్షల కోట్ల బడ్జెట్ గల రాష్ట్రంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడో నెంబర్ గేటు మరమ్మతు కోసం రూ.10 కోట్లు కేటాయించలేని చేతకాని ప్రభుత్వం...జగన్ ప్రభుత్వమని విమర్శించారు. గేటు నిర్మాణానికి ఆరుసార్లు టెండర్లు పిలిచినా ఒక్కరూ ముందుకు రాకపోవడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. రూ.670 కోట్లతో 14 ఏళ్ల క్రితం నిర్మించిన గుండ్లకమ్మ ప్రాజెక్టు లక్ష్యాలకు దూరంగా ఉందన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు నుంచి సక్రమంగా నీరు లేకపోవడంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో 60 వేల ఎకరాలు, రబీలో 80 వేల ఎకరాలు పంట వేయలేదన్నారు. నీరంతా సముద్రం పాలైందని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రాజెక్టు

- మిగతా 2 లో

కాంగ్రెస్‌ది సంక్షేమాస్త్రం

- సమర్థ వ్యూహంతోనే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు
- లోక్‌సభ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు
- బీజేపీ అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టాలి
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- సీడబ్ల్యూసీలో మల్లికార్జున ఖడ్గే

న్యూదిల్లీ: రాబోయే ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెస్‌కు సమర్థ వ్యూహం అవసరమని, ప్రస్తుతం-గతంలో, చేసిన సంక్షేమమే తమకు ఎన్నికల అస్త్రమని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే అన్నారు. కులగణన వంటి జాతీయ స్థాయి సమస్యలతో ప్రజల్లోకి వెళ్లడమే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు అనుసరించబోయే వ్యూహమని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అధికార పక్ష తప్పుడు ప్రచారాలకు కౌంటర్ ఇచ్చే కథనాలతో సిద్ధం కావాలని పార్టీశ్రేణులకు సూచించారు. 2024లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రస్తుతం ఐదు రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు ముఖ్యమని చెప్పారు. ఎన్నికల వేళ తమ పార్టీపై బీజేపీ అబద్ధపు ప్రచారాల జోరు పెరుగుతుందని, వాటిని తిప్పికొట్టడమే కాదు గట్టి బదులు ఇచ్చేలా మనం ఉండాలని పార్టీ కార్యకర్తలు, నాయకులనుద్దేశించి ఖడ్గే అన్నారు.ఆయన సోమవారం న్యూదిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో ప్రసంగిస్తూ ఎన్నికల వేళ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కల్తీ మద్యం, కల్తీ ఓట్లు, కల్తీ ప్రజాస్వామ్యం కల్తీ పాలన ఎలా వుంది?

అర్థశాస్త్రంలో క్లాడియా గోల్డిన్‌కు నోబెల్

స్టాక్‌హోమ్: అమెరికా ఆర్థికవేత్త, హార్వర్డ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ క్లాడియా గోల్డిన్(77)ను అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారం వరించింది. లేబర్ మార్కెట్‌లో శ్రామిక మహిళల భాగస్వామ్యంపై అధ్యయనానికి క్లాడియా గోల్డిన్‌ను నోబెల్ కోసం ఎంపిక చేసినట్టు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సోమవారం వెల్లడించింది. అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారం అందుకున్న మహిళల్లో ఈమెది మూడోస్థానమని తెలిపింది. శతాబ్దంలో అనేక అధిక ఆదాయ దేశాల్లో వేతన మహిళల నిష్పత్తి మూడు రెట్లు పెరిగింది. క్లాడియా గోల్డిన్ పరిశోధనలు లేబర్ మార్కెట్‌లో మహిళల సమకాలీన పాత్రలపై సమగ్ర వివరాలను అందించినట్లు నోబెల్ కమిటీ తెలిపింది. అంతర్లీన కారకాలు, భవిష్యత్తులో ఏ సవాళ్లకు పరిష్కారాలు కనుగొనాలో కూడా క్లాడియా గోల్డిన్ అధ్యయనాలతో వెల్లడైనట్లు కమిటీ చైర్మన్ జాకోబ్ స్వెన్సన్ వెల్లడించారు. క్లాడియా గోల్డిన్ 1946లో న్యూయార్క్‌లో జన్మించారు. షికాగో యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. కేంబ్రిడ్జ్‌లోని హార్వర్డ్ యూనివర్సిటీలో ఎకనామిక్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అమెరికాకు చెందిన బెన్ షాలోమ్ బెర్నాంకే, డగ్లస్ డబ్ల్యూ. డైమండ్, ఫిలిప్ హెచ్.డైబ్‌విగ్ గతేడాది అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని అందుకున్నారు. ఇదిలావుంటే, ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారాన్ని పొందడంపై క్లాడియా గోల్డిన్ ఆశ్చర్యాన్ని, అమితానందాన్ని వ్యక్తం చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. 1968 నుంచి అర్థశాస్త్రంలో నోబెల్ పురస్కారాన్ని అందజేస్తున్నారు. ఇప్పటివరకు 92 మంది ఆర్థికవేత్తలు ఈ అవార్డును అందుకున్నారు. కాగా, విజేతల ప్రకటనలు పూర్తి కాగా డిసెంబరులో ఓస్లో, స్టాక్‌హోమ్‌లో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుంది. గతంలో కంటే ఒక మిలియన్ స్వీడిషన్ క్రోనర్‌ను పెంచి మొత్తం 11 మిలియన్ స్వీడిష్ క్రోనర్ (సుమారు మిలియన్ డాలర్లు) నగదు, 18 కారెట్ స్వర్ణపతకం, డిప్లమాను అవార్డు గ్రహీతలకు అందజేయనున్నారు.

ఆగని భీకర పోరు

గాజాపై ఇజ్రాయిల్ దండయాత్ర

జెరూసలేం: ఇజ్రాయిల్, హమాస్‌కు మధ్య భీకర పోరు మూడవ రోజు కొనసాగింది. ఇజ్రాయిల్ సైన్యం ఏ మాత్రం వెనక్కు తగ్గకుండా బాంబు వర్షాన్ని గాజాపై కురిపిస్తోంది. ఇప్పటికే 800 మందికిపైగా ఇజ్రాయిలీలు మరణించగా, 2,400 మందికి గాయాలయ్యాయి. గాజాలోనూ ప్రాణ నష్టం జరిగింది. 510 మంది పలస్తీనా ప్రజలు చనిపోగా 2,751 మందికి గాయాలయ్యాయి. యుద్ధం కారణంగా 1,23,538 మంది పలస్తీనియన్లు గాజాను వీడినట్లు ఐరాస వెల్లడించింది. 64 స్కూళ్లలో ఏర్పాటు చేసిన శిబిరాల్లో అనేకమంది ఆశ్రయం పొందుతున్నట్లు పేర్కొంది. హమాస్ కార్యకర్తలను తుడిచిపెట్టడానికి ఇజ్రాయిల్ తమ దేశ

- మిగతా 2 లో

'టూ స్టేట్స్' పరిష్కారంతోనే శాంతి: సీపీఐ

2 లో

చంద్రబాబు అరెస్ట్‌లో కక్ష సాధింపు లేదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌లో ఎలాంటి కక్ష సాధింపు లేదని, ఒకవేళ కక్ష సాధింపునకు పాల్పడి ఉంటే కేంద్రంలో బీజేపీలో ఉందని, ఆ బీజేపీకి చెందిన వారిలో సగం మంది టీడీపీ వాళ్లు ఉన్నారని వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో సోమవారం వైసీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సీఎం మాట్లాడుతూ, అవినీతి గురించి తెలిసినందునే, గతంలో ఈడీ, సీబీఐ నోటీసులు ఇచ్చాయని గుర్తుచేశారు, స్పష్టమైన ఆధారాలు ఉన్నా చంద్రబాబును అరెస్టు చేయవద్దా ? అని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టును సమర్థించడం అంటే, పేదలను వ్యతిరేకించడమేనని అన్నారు. చంద్రబాబును సమర్థించడం అంటే పెత్తందారీ వ్యవస్థను సమర్థించడమేనని నొక్కి చెప్పారు. చంద్రబాబు అవినీతి వాటాలో దత్త పుత్రుడికీ వాటా ఉందన్నారు. టీడీపీ, దత్తపుత్రుడి మోసాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తమ ప్రభుత్వం అవినీతిరహిత పాలన అందిస్తోందని స్పష్టం చేశారు. రాజకీయమంటే చనిపోయాక కూడా ప్రజల గుండెల్లో బ్రతికుండటమేనని అన్నారు. వైసీపీ పేదల పార్టీ అని, మళ్లీ అధికారంలోకి తిరిగి వచ్చేందుకు పార్టీ శ్రేణులంతా మమేకమై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. తమ పొత్తు ప్రజలతోనేనని, మీ బిడ్డ ఎవరి పొత్తులపైన ఆధారపడబోరని సీఎం పునరుద్ఘాటించారు. తాను దేవుడుని, ప్రజలను నమ్ముకున్నానని స్పష్టం చేశారు. సీఎం జగన్ అంటే మాటపై నిలబడే వ్యక్తి అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎన్ని సున్నాలు కలిసినా మిగిలేది సున్నానేనని సీఎం జగన్ ఎద్దేవా చేశారు.

'టూ స్టేట్స్' పరిష్కారంతోనే శాంతి: సీపీఐ

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్, పలస్తీనా మధ్య శాశ్వత శాంతి నెలకొల్పడం ఎంతో అవసరమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యదర్శివర్గం ఒక ప్రకటనలో పేర్కొంది. తాజా యుద్ధ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసింది. యుద్ధం వల్ల లాభం ఉండదని, ప్రాణ నష్టం భారీగా జరుగుతుందని, ఇప్పటికే విలువైన వేల ప్రాణాలు పోయాయని, రక్తపాతాన్ని నివారించేందుకు సంయమనం పాటించాలని ఇజ్రాయిల్, పలస్తీనాకు విజ్ఞప్తి చేసింది. ఈ ప్రాంతంలో శాశ్వత శాంతి స్థాపనకు చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ సమాజానికి, ఐక్యరాజ్య సమితితో పాటు భారత ప్రభుత్వానికి పిలుపునిచ్చింది. పలస్తీనాకు తూర్పు జెరూసలేం రాజధానిగా 1967కు ముందున్న సరిహద్దుల ప్రకారం 'టూ స్టేట్స్' పరిష్కారమే ఉత్తమమని అభిప్రాయపడింది. టూ స్టేట్స్ పరిష్కార మార్గానికి నిస్సందేహంగా సమర్థన తెలపాలని భారత ప్రభుత్వానికి సీపీఐ సూచించింది.

ఏసీబీకి చిక్కిన ఆదోని మున్సిపల్ అధికారులు

విశాలాంధ్ర-విజయవాడ: కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ కార్యాలయం మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మహాలక్ష్మి, కృష్ణ చరణ్‌లను లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోని మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసిన శ్రీనివాసులు, తన సస్పెన్షన్ కాలానికి నాన్-డ్రావల్ సర్టిఫికెట్ జారీ చేయుటకుగాను ఆ అధికారులు రూ.30 వేల లంచం డిమాండ్ చేశారు. దీనిపై శ్రీనివాసులు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఇంతకుముందు రూ.5 వేలు తీసుకున్న అధికారులు తాజాగా రూ.10 వేలు తీసుకుంటుండగా కర్నూలు రేంజ్ అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. నిందితులను అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపర్చారు.

ఆగని భీకర పోరు

(మొదటిపేజీ తరువాయి)

దక్షిణ ప్రాంతంపై బాంబులు కురిపిస్తోంది. హమాస్ కార్యకర్తలు సరిహద్దులో ఉన్న గోడను బుల్డోజర్లతో పగులగొట్టి, ముళ్లకంచెను కత్తిరించారు కనక ఆ ప్రాంతాల్లో కూడా ట్యాంకులతో పహరా కాస్తోంది. తమ దేశం మీద భారీగా రాకెట్లు ప్రయోగించినందుకు ఇప్పటికే యుద్ధం ప్రకటించింది. హమాస్ అధీనంలోని గాజా ప్రాంతంలోకి ఇజ్రాయిల్ పదాతి దళాలను పంపే అవకాశముంది. గాజాను సంపూర్ణంగా దిగ్బంధించాలని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి యొయావ్ గలాంట్ సైనికులను ఆదేశించారు. గాజాకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పాటు ఆహార పదార్థాలు, ఇంధనం సరఫరా నిలిపివేయాలని ఇజ్రాయిల్ ఆలోచిస్తోంది. ఇజ్రాయిల్ ఆదివారం నుంచి కనీసం హమాస్ స్థావరాలను దెబ్బతీయడానికి వెయ్యి చోట్ల దాడులకు దిగింది. హమాస్ అధీనంలోని బీత్ హానోన్‌ను దాదాపు ధ్వంసం చేసింది. యుద్ధం కొనసాగించడానికి ఇజ్రాయిల్ మూడులక్షల మంది రిజర్వ్ సైనికులను రంగంలోకి దింపింది. హమాస్‌కు ఎలాంటి సైనికశక్తి మిగలకుండా చేయాలన్నది ఇజ్రాయిల్ లక్ష్యం. హమాస్ గాజాను పాలించే అవకాశం లేకుండా చేయాలన్న ఉద్దేశం ఉంది. 2007లో ప్రత్యర్థి పలస్తీనా వర్గం నుంచి గాజాను అహమాస్ స్వాధీనం చేసుకున్నప్పుడు ఇజ్రాయిల్, ఈజిప్టు అనేక ఆంక్షలు విధించాయి. ఇంతకు ముందు ఇజ్రాయిల్ ఇలాంటి దాడికి తెగబడినప్పుడు అపారమైన ప్రాణ నష్టం జరిగింది. పరస్పర దాడుల వల్ల సాధారణ పౌరులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఈ దాడుల్లో ఇజ్రాయిలీలు 700 మందితో కలిపి రెండు పక్షాలకు చెందిన కనీసం 1200 ఈ ఘర్షణలకు బలయ్యారు. ఒకవైపు దాడులు జరుగుతున్నా హమాస్ రాకెట్లు ప్రయోగిస్తూనే ఉంది. తాము 130 మందిని బందీ చేసినట్లు వెల్లడించింది. తమ దళాలు సోమవారం ఉదయం దాడులు చేశాయని హమాస్ అధికార ప్రతినిధి అబ్దుల్ లతీఫ్ చెప్పారు. మరింత మందిని బందీలను చేశామని అన్నారు. గాజా నది పశ్చిమ ప్రాంతంలోని పలస్తీనియన్లపై ఇజ్రాయిల్ హింసాకాండ హమాస్‌ను తీవ్రంగా స్పందించడానికి ప్రేరేపించింది. 1967లో ఇజ్రాయిల్ దాడి చేసి స్వాధీనం చేసుకున్న ప్రాంతాలు తమ అధీనంలో ఉండేట్టు చేసుకోవాలని హమాస్ భావిస్తోంది. రెండు పక్షాల మధ్య సంప్రదింపులు ఆగిపోయి పదేళ్లకు పైగా అయింది. గాజా పొలిమేరల్లో ఉన్న ఐదు పట్టణాలలోని ప్రజలను ఇజ్రాయిల్ అక్కడి నుంచి ఖాళీ చేయిస్తోంది. ఇజ్రాయిల్ యుద్ధం ప్రకటించిన తరవాత గాజా మీద వైమానిక దాడులు పెచ్చరిల్లాయి. దక్షిణ గాజాలోని రఫా పట్టణంపై జరిగిన దాడిలో 19 మంది మరణించారు. అమెరికా పంపుతున్నాన్న విమాన వాహక నౌక ఆదివారమే బయలుదేరింది. ఇజ్రాయిల్‌కు అవసరమైతే ఈ నౌక యుద్ధంలోకి దిగుతుంది. ఇజ్రాయిల్ ఉత్తర ప్రాంతంపై లెబనాన్ నుంచి హిజ్బుల్లా దాడులు కొనసాగిస్తూనే ఉంది.

ఎన్నికలకు వేళాయె

(మొదటిపేజీ తరువాయి)

నవంబరు 7న (20 స్థానాలకు), 17న (70 స్థానాలకు) రెండు దశలలో ఎన్నికలు ఉంటాయని ఆయన చెప్పారు. ఐదు రాష్ట్రాల్లో మొత్తం 16 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారని, వీరిలో 8.2 కోట్ల మంది పురుషులు కాగా 7.8 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు రాజీవ్ కుమార్ వెల్లడించారు. 60.2 లక్షల మంది మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. తొలిసారిగా 'ఎలక్షన్ సీజర్ ఇండ్యూస్‌మెంట్-ఫ్రీ ఎలక్షన్స్' పద్ధతిని అనుసరించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు కుమార్ తెలిపారు. ఐదు రాష్ట్రాల్లో 1.77 లక్షల పోలింగ్ కేంద్రాలు ఉంటాయని, 1.01 లక్షల కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ వసతి ఉంటుందన్నారు. 940 చెక్‌పోస్టుల ద్వారా అంతర్రాష్ట్ర సరిహద్దులపై నిఘా పెట్టామన్నారు. అక్రమంగా మద్యం, నగదు, మాదకద్రవ్యాలను సరఫరా చేయకుండా పకడ్బందీ పహారా ఉన్నట్లు తెలిపారు. ఉచితాల విషయంలోనూ నిఘా ఉందన్నారు. ధనబలం వినియోగాన్ని ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. ఆన్‌లైన్‌లో అనుమానస్పద నగదు బదిలీలు జరగడకుండా నిఘా పెంచినట్లు చెప్పారు. 8,000 మహిళా పోలింగ్ కేంద్రాలు ఉంటాయని రాజీవ్ కుమార్ తెలిపారు. 'లోక్‌సభ ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ప్రాధాన్యత ఏర్పడింది. మిజోరం, చత్తీస్‌గఢ్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్నికల సన్నద్ధతను పరిశీలించాం. అందరు భాగస్వాములు, రాజకీయ పార్టీలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల ప్రతినిధులను సమావేశమయ్యాం' అని సీఈసీ చెప్పారు. ఓటర్ల జాబితాల తయారీ, మార్పులు-చేర్పులతో పాటు ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించే విధంగా కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా దృష్టిని సారించిందన్నారు.

ఇజ్రాయిల్‌కు సాయం చేయొద్దు

అమెరికాలో పలస్తీనా అనుకూల ప్రదర్శనలు

వాషింగ్టన్: ఇజ్రాయిల్-హమాస్ మధ్య సైనిక ఘర్షణల క్రమంలో పలస్తీనాకు మద్దతు పెరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా పలస్తీనా ప్రజల పోరాటానికి సంఘీభావం లభిస్తోంది. పలస్తీనాకు సంఘీభావ ఉద్యమానికి ఈరోజు చరిత్రాత్మక దినం. ది ఆన్సర్ కోయిలేషన్‌తో పాటు మరికొన్ని సంఘాల అధ్వర్యంలో అమెరికావ్యాప్తంగా సోమవారం భారీ ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. క్లీవ్‌ల్యాండ్, మిన్నియాపోలిస్, అల్బానీ, న్యూయార్క్, ఓర్మండ్ బీచ్, న్యూహవెన్ తదితర నగరాల్లో ర్యాలీలు నిర్వహించారు. స్వేచ్ఛ కోసం పలస్తీనా ప్రజల పోరాటానికి సంపూర్ణ సంఘీభావం తెలిపారు. తక్షణమే ఇజ్రాయిల్‌కు సాయాన్ని నిలిపివేయాలని అమెరికా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలస్తీనా రాజకీయ ఖైదీల విడుదల, గాజాలో ఆంక్షల ఎత్తివేతకు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్‌లోని వివక్షపూరిత ప్రభుత్వానికి అండగా నిలిచే రాజకీయ నేతల నిసిగ్గు ధోరణి తాజా పరిణామాలకు దారితీసిందని నిరసనకారులు దుయ్యబట్టారు. 'మేము న్యాయం పక్షాన్న ఉన్నాం. వివక్ష పాలనకు మద్దతిచ్చేవారిదే తప్పుడు పక్షమని చరిత్ర చెబుతోంద'ని నిరసనకారులు నినదించారు. ఇజ్రాయిల్ మారణహోమాలకు అమెరికా ప్రభుత్వం సహాయ సహకారాలు అందించే తరుణంలో ప్రజలు పలస్తీనా పక్షాన నిలుస్తున్నారని తాజా ప్రదర్శనలు స్పష్టంచేశాయి. దేశవ్యాప్తంగా ఈనెల 10,11,12 తేదీల్లోనూ అనేక చోట్ల ప్రదర్శనలు జరగనున్నాయి. తీవ్ర అణచివేత, హత్యలు, వేధింపులతో పాటు 'ఆక్యుపేషన్'ను ఇజ్రాయిల్ దశాబ్దాలుగా పలస్తీనాపై కొనసాగుతుండటాన్ని పలస్తీనా ప్రతిఘటన దళాలు తిప్పికొడుతూ వచ్చాయి. పలస్తీనా ప్రజలపై అణచివేత చర్యలను కొనసాగించేందుకు ఇజ్రాయిల్‌కు ఏటా పన్నుల నిధి నుంచి నాలుగు బిలియన్ డాలర్లు అమెరికా సమకూరుస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.

పలస్తీనా ప్రజలకు మద్దతిద్దాం

గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ పిలుపు

ఏథేన్స్: పలస్తీనా ప్రజలకు తమ హక్కులను పరిరక్షించుకునే హక్కు ఉందని, ఇందుకోసం సాగించే పోరాటంలో వారికి సంపూర్ణ మద్దతు, సంఘీభావం అవసరమని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) పేర్కొంది. ఇజ్రాయిల్ సాయుధ దళాలకు, హమాస్‌కు మధ్య పోరు నేపథ్యంలో పలస్తీనాకు మద్దతిస్తూ కేకేఈ కేంద్ర కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. పలస్తీనా ప్రజలకు వ్యతిరేకంగా దీర్ఘకాలంగా జరుగుతున్న వ్యూహాత్మక నేరాలను, ఇజ్రాయిల్ 'ఆక్యుపేషన్' విధానాన్ని తీవ్రంగా ఖండించింది. అమెరికా, యూరోపియన్ యూనియన్, వాటి మిత్రపక్షాల మద్దతుతో లక్షలాది మంది పలస్తీనా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది గాయాలపాలయ్యారు. నిర్బంధానికి గురయ్యారు. పలస్తీనా భూభాగంలోని నగరాలు, గ్రామాలు నాశనమయ్యాయి. తాజా ఘటనలు ఏదో ఆకస్మికంగా జరిగినవి కాదు. ఇందుకు కారణాలను ప్రశ్నించే వారు ముందుగా వాస్తవాలను తెలుసుకోవాలి. ఇజ్రాయిల్ సైనిక దాడులు రోజురోజుకు పేట్రేగిపోతున్నాయి. పిన్నలు, వృద్ధులు తేడా లేకుండా భారీ సంఖ్యలో పలస్తీనా ప్రజలు హింసకు బలవుతున్నారు. నేరాలు బాగా పెరిగాయి.

వీటిని కేకేఈ ఎప్పటికప్పుడు ఖండిస్తోంది. పలస్తీనా ప్రజల హక్కుల పరిరక్షణ పోరాటం సమర్థనీయం. ఇజ్రాయిల్ 'ఆక్యుపేషన్' అంతానికి, స్వతంత్ర దేశ పోరాటాన్ని సంఘీభావం తెలుపడం అవశ్యం' అని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ప్రకటన పేర్కొంది.

విశాలాంధ్ర ప్రపంచం

పేదల సంక్షేమానికి

శక్తిమంతమైన అడుగు

- కులగణనపై రాహుల్ గాంధీ
- బీజేపీ చేయకపోతే కాంగ్రెస్ చేస్తుందని హామీ

న్యూఢిల్లీ: జాతీయస్థాయిలో కులగణన నిర్వహించడం వల్ల అన్ని వర్గాల సామాజిక న్యాయానికి హామీ లభిస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కులగణన నిర్వహణకు బీజేపీపై ఒత్తిడి తెస్తామని, ఆ పార్టీ వల్ల కాకపోతే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని పూర్తి చేస్తామని హామీనిచ్చారు. కులగణన నిర్వహణకు ఇండియా కూటమిలోని పార్టీలన్నీ కలిసివస్తాయన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. ఏదేని పార్టీ విభేదించినా పర్వాలేదని, అర్థం చేసుకుంటామని చెప్పారు. కులగణన డిమాండ్‌కు సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా నిర్ణయించడం చారిత్రకమని రాహుల్ గాంధీ అన్నారు. పేదల విమోచనానికి శక్తిమంతమైన అడుగుగా కుల గణనను వర్ణించారు. సీడబ్ల్యూసీ భేటీ అనంతరం రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ కులగణన నిర్వహించాలంటే ప్రధాని మోదీ భయపడుతున్నారని, ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. సుమారు నాలుగు గంటల పాటు చర్చలు జరిపిన అనంతరం కులగణన నిర్వహించాలని సీడబ్ల్యూసీ ఏకగ్రీవంగా నిర్ణయించిందన్నారు. ఇది చాలా ప్రగతిశీల నిర్ణయమని చెప్పారు. ఓబీసీల కోసం ప్రధాని చేసినదేమిటని ప్రశ్నించారు. దృష్టి మళ్లింపు చర్యల్లో ఆయన దిట్టని విమర్శించారు. కులగణనతో పాటు ఆర్థిక సర్వేను కాంగ్రెస్ నిర్వహిస్తుందని, దాంతో సంపద, ఆస్తుల వివరాలు వెల్లడవుతాయని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు కులగణన నిర్వహించకపోవడం పార్టీ చేసిన తప్పుగా తెలిపారు. తప్పును సరిచేస్తామన్నారు. భారత్‌లో దళితులు, ఓబీసీలు, గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. లిట్మస్ పరీక్ష కెమిస్ట్రీలో ఉంటుందని రాజకీయాల్లో కాదని తాజా ఎన్నికలు కాంగ్రెస్‌కు అగ్నిపరీక్ష అనే అంశంపై ఓ ప్రశ్నకు రాహుల్ బదులిచ్చారు. కులగణన అన్నది ఓబీసీలు, దళితులు, గిరిజనులు, పేదల సంక్షేమం కోసమే తప్ప కులం లేక ధర్మానికి సంబంధించినది కాదని అన్నారు. నేడు రెండు భారత్‌లు ఉన్నాయి. ఒక అదానీది కాగా మరొకటి మిగతా వారిదని రాహుల్ వ్యాఖ్యానించారు.

దోపిడీ సాధనంగా

పట్టణ సంస్కరణలు

బి.వి.రాఘవులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజలను దోచుకునే సాధనంగా పట్టణ సంస్కరణలు ఉన్నాయని, సంక్షోభం నుంచి బయటపడేందుకు పాలకులు వాటిని వినియోగించుకుంటున్నారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు అన్నారు. వడ్డేశ్వరంలోని సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో రెండు రోజుల పాటు జరగనున్న పట్టణ ప్రాంత కార్యకర్తల వర్క్ షాప్‌ను సోమవారం రాఘవులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం నెల్లూరు జిల్లా నాయకులు, మాజీ డిప్యూటీ మేయర్ మాదల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సంస్కరణల ప్రభావంతో ఏర్పడుతున్న సంక్షోభం నుంచి బయటపడేందుకు పట్టణీకరణను ఒక సాధనంగా వాడుతున్నారని చెప్పారు. పట్టణాల అభివృద్ధికి అవే అవరోధంగా మారుతున్నాయని, ప్రజలపై భారాలు పెరుగుతున్నాయని వివరించారు. పౌర సదుపాయాలను వ్యాపారంగా మార్చేస్తున్నారని తెలిపారు. పేదలు నివసించే కాలనీలు, ధనికులు నివసించే కాలనీల మధ్య అసమానతలు విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వమూ కేంద్రం సంస్కరణలను అమలు చేస్తూ గుడ్డిగా అదేబాటలో పయనిస్తూ ప్రజలను ఇబ్బందులు పాల్జేస్తోందన్నారు. దేశంలో, రాష్ట్రంలో మురికివాడలను రూపుమాపుతామని చెబుతున్న ప్రభుత్వాలు ఆధునిక మురికివాడలను నెలకొల్పుతున్నాయని విమర్శించారు. తొలుత వక్తలను పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు వేదిక మీదకు ఆహ్వానించారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో సీపీఎం నాయకులు గంగారావు తదితరులు పాల్గొన్నారు.

సీడబ్ల్యూసీ తీర్మానం హర్షణీయం

బీసీల కుల జనగణనపై గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలో బీసీల కుల జనగణన కోరుతూ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) చేసిన ఏకగ్రీవ తీర్మానంపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని బలహీనవర్గాల సామాజిక న్యాయ ప్రస్థానంలో కాంగ్రెస్ నిర్ణయం ఒక గొప్ప ముందడుగుగా నిలిచిపోనున్నదని తెలిపారు. 2011లో సామాజిక అంశాల వారీగా జనగణన జరిగి 2015లో నివేదిక మోదీ ప్రభుత్వం ముందుకు వచ్చినప్పటికీ, ఇప్పటివరకు దానిని బయట పెట్టకపోవడం బలహీనవర్గాల వ్యతిరేక విధానానికి నిదర్శనమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వెంటనే బీసీల కుల జనగణన చేపడుతున్నట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారన్నారు. బీసీల ఆకాంక్షను కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ముందుకు తీసుకువెళుతుందని రుజువైందన్నారు. కాంగ్రెస్‌కు ప్రస్తుతం ఉన్న నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులలో ముగ్గురు బీసీ వర్గానికి చెందిన వారున్నారని, ఇది బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనమని తెలిపారు. ప్రస్తుతం 10 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ కేవలం ఒకే ఒక బీసీ ముఖ్యమంత్రి ఉన్నారని, దీనిని చూస్తుంటే బీసీల పట్ల బీజేపీ డొల్లతనం స్పష్టమైందని అన్నారు.

ప్రాజెక్టులపై చిత్తశుద్ధి కరువు

(మొదటిపేజీ తరువాయి)

మరమ్మతులకు నిధులు కేటాయించి, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రైతన్న పోరాటాలకు సీపీఐ అండగా ఉంటుందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు మాదిరిగా అన్నమయ్య ప్రాజెక్టులోనూ నాలుగు గేట్లు కొట్టుకుపోయాయని, నాలుగు కోట్ల రూపాయలు కేటాయిస్తే వాటికి మరమ్మతు చేసే అవకాశం ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆ ప్రాజెక్టు పూర్తిస్థాయి ముంపునకు గురైందన్నారు. ఇప్పుడు రూ.805 కోట్లు ఖర్చు చేస్తే గానీ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాదన్నారు. ఇది కేవలం జగన్ చేతకాని పాలనకు నిదర్శనమన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రజా సమస్యలు గాలికి వదిలేసి వలంటీర్ల ద్వారా డబ్బు రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రాజకీయాలకతీతంగా గుండ్లకమ్మ ప్రాజెక్టుకు నిధులు సాధించాలని పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ రాష్ట్ర జలవనరులశాఖమంత్రి అంబటి రాంబాబు తన శాఖ విషయాలు మినహా అన్నీ మాట్లాడతారని ఆరోపించారు. పాదయాత్రలో గుండ్లకమ్మ ఆయకట్టు రైతుసంఘం నాయకులు వడ్డే హనుమారెడ్డితో పాటు బాణాల రామయ్య, లక్ష్మి, చెరుకూరి వాసు, ఆంజనేయులు, పోలవరపు కోటేశ్వరరావు, కె.వీరారెడ్డి, కొండయ్య, టీవీ శేషయ్య, కొత్తకోట వెంకటేశ్వర్లు, పోకూరి వెంకటేశ్వర్లు, పీవీఆర్ చౌదరి, స్వర్ణ కృష్ణయ్య, ఎస్‌డీ సర్దార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో నల్లమల రైతుసంఘం రాష్ట్ర నాయకులు కొల్ల రాజమోహన్‌రావు, కాంగ్రెస్ కిసాన్ విభాగం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలవరపు వెంకటరామయ్య, మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ రంగారావు, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు, ఒంగోలు ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది సంక్షేమాస్త్రం

(మొదటిపేజీ తరువాయి)

మరింతగా ప్రజల్లోకి వెళ్లాలని సూచనలు చేశారు. సమన్వయంతో, క్రమశిక్షణతో, ఐక్యంగా పనిచేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జాతీయ స్థాయి కులగణన నిర్వహణతోనే సామాజిక న్యాయం, ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలు హక్కులకు హామీ లభిస్తుందని నొక్కిచెప్పారు. ఈ అంశంపై బీజేపీ మౌనం వహిస్తోందని అన్నారు. సంక్షేమ పథకాల్లో సముచిత వాటా కోసం సమాజంలోని బడుగు, బలహీన వర్గాల సామాజిక-ఆర్థిక డేటా కీలకమని ఖర్గే తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లను కాంగ్రెస్ అమలు చేస్తుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధిస్తే రాష్ట్రాల శాసనసభలకు జరిగే ఎన్నికల్లోనూ మహిళా రిజర్వేషన్ అమలు చేస్తామని ఖర్గే హామీనిచ్చారు. రాజస్తాన్, చత్తీస్‌గఢ్, మిజోరం, తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు నవంబరు 7 నుంచి 30వ తేదీ వరకు ఎన్నికలు జరగనున్నాయని, ఇందులో పార్టీ గెలవాలంటే సమర్థ వ్యూహం ఉండాలని ఖర్గే నొక్కిచెప్పారు. 'ద్రవ్యోల్బణం, నిరుద్యోగంతో దేశం సతమతమవుతోంది. పాత పింఛన్ పథకాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. అధికార పక్ష విభజన వ్యూహాలు, స్వయంప్రతిపత్తి సంస్థల దుర్వినియోగం వంటివి ప్రజాస్వామ్య సుస్థిరతకు ముప్పుగా మారాయి. మణిపూర్ అట్టుడికిపోతే ఆ రాష్ట్రంలో అడుగుపెట్టని ప్రధాని ప్రస్తుతం ఎన్నికల రాష్ట్రాలలో తిరుగుతున్నారు. కాంగ్రెస్ పార్టీపై అబద్ధాలు చెప్పుకోవడం ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలన్నదే బీజేపీ వ్యూహం. దీనిని తిప్పికొట్టాలి' అని ఖర్గే అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ప్రస్తుతం, గతంలో చేసిన సంక్షేమ పనుల గురించి విస్తృత ప్రచారం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. హిమాచల్ ప్రదేశ్, కర్నాటకలో ఘన విజయాలతో పార్టీకి నూతనోత్సాహం లభించిందన్నారు. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనూ గెలవడమే ధ్యేయంగా పనిచేయాలని ఖర్గే పిలుపునిచ్చారు.

వైసీపీ సన్నద్ధం

(మొదటిపేజీ తరువాయి)

సమన్వయకర్తలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు హాజరయ్యారు. ఈ సమావేశంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే అంశం పైన, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే విషయం పైన మండల స్థాయి నాయకత్వం క్రియాశీలకంగా నిలవాలని సీఎం జగన్ దిశానిర్దేశం చేశారు. ఎన్నికలు రానుండటంతో ఆ దిశగా ఒక వైపు పార్టీ కార్యక్రమాలను, మరోవైపు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, గ్రామాల్లో ఘంటాపథంగా పథకాలపై చర్చించి వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా నాలుగు కీలక కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్ ప్రకటించారు. ఇందులో మొదటిగా జగనన్న ఆరోగ్య సురక్ష అని, ఈ కార్యక్రమం ఇప్పటికే సెప్టెంబరు 30న ప్రారంభమై నవంబరు 10 వరకు కొనసాగుతుందని వెల్లడించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా రాష్ట్రంలో ఏ ఒక్క కుటుంబం వ్యాధుల బారిన పడకుండా ఉండటమే దీని లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్యాంపులు నిర్వహించాలని, అందులో పార్టీ ప్రతినిధులు, ప్రధానంగా మండల శ్రేణులు భాగస్వాములు కావాలన్నారు. కోటీ 60 లక్షల ఇళ్లను ఈ కార్యక్రమాల ద్వారా ద్వారా కవర్ చేయనున్నామని వివరించారు. ప్రతి ఇంటికీ ఎమ్మెల్యే, పార్టీ ప్రతినిధుల నేతృత్వంలో వెళ్లి జల్లెడ పడతామని, ప్రజల ఆరోగ్యంపై ఆరా తీస్తామన్నారు. రెండోదిగా, 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నవంబరు 1 నుంచి డిసెంబరు 10 వరకు 40 రోజుల పాటు ప్రణాళిక రూపొందించినట్లు సీఎం జగన్ ప్రకటించారు. గ్రామాల్లోని సచివాలయాలను పార్టీ బృందాలు సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు జరిగిన న్యాయం పైన వివరించాలన్నారు. కోటీ 60 లక్షల మంది ఇళ్లకు వెళ్లాలని సూచించారు. సచివాలయ పరిధిలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు తెలియజేయాలన్నారు. 2019లో వైసీపీ ఇచ్చిన ప్రతి హామీని మేనిఫెస్టోలో 99 శాతం అమలు చేసిన తీరును గడప గడపకూ వివరించాలని చెప్పారు. ఈ బాధ్యత మండల పార్టీ బాధ్యుల పైన, ఎమ్మెల్యేల పైన, పార్టీ ముఖ్య నేతల పైన ఉందన్నారు. మూడో కార్యక్రమంలో భాగంగా అక్టోబరు 25 నుంచి డిసెంబరు 31 వరకు అనగా 60 రోజుల పాటు సామాజిక న్యాయమే లక్ష్యంగా మూడు ప్రాంతాల్లో బస్సు యాత్రలు జరుగుతాయన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సీనియర్ నేతలతో కలిసి తాను పర్యటిస్తానని వెల్లడించారు. రోజుకు మూడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల అధ్యక్షతన సభలు జరుగుతాయని చెప్పారు. రాబోయే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే ఎన్నికలుగా సమగ్రంగా ప్రజల్లోకి తీసుకువెళతామని అన్నారు. నాలుగో కార్యక్రమంలో భాగంగా 'ఆడుదాం-ఆంధ్రా'ను డిసెంబరు 11 నుంచి జనవరి 15 వరకు నిర్వహిస్తామని సీఎం తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి మండల, పట్టణ, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించి యువతను ఉత్తేజ పరచడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఇక నుంచి ప్రతి ఏటా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. దేశ చరిత్ర పుటల్లో రాష్ట్రం నుంచి క్రీడలకు ప్రధాన స్థానం కలిగించేలా 'ఆడుదాం-ఆంధ్రా' నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ నాలుగు కార్యక్రమాల్లోనూ పార్టీ శ్రేణులు భాగస్వాములు కావాలని జగన్ ఆదేశించారు.

మరో మూడు కార్యక్రమాలు ప్రకటించిన జగన్

ఈ సమావేశం వేదికగా మరో మూడు కార్యక్రమాలను వైసీపీ అధినేత జగన్ ప్రకటించారు. జనవరి ఒకటి నుంచి 10వ తేదీ వరకు అవ్వా తాతలకు, వితంతువులకు రూ.3 వేల పెన్షన్ పెంపు కార్యక్రమానికి శ్రీకారం చుడతామని వెల్లడించారు. పది రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులంతా గ్రామస్థాయిలో భాగస్వాములై సంబరాలు నిర్వహించాలని కోరారు. జనవరి 10 నుంచి 20 వరకు వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని పది రోజులపాటు నిర్వహిస్తామని చెప్పారు. దీనిపైన విస్తృతంగా పార్టీ శ్రేణులు ప్రచారం చేయాలన్నారు.

జనవరి 20 నుంచి 30 వరకు మరో 10 రోజుల పాటు వైఎస్సార్ ఆసరా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంతో చేకూరిన లబ్ధిపై ప్రజల్లోకి వెళ్లి పార్టీ శ్రేణులు అవగాహన కల్పించాలన్నారు. ఫిబ్రవరిలో వైసీపీ మేనిఫెస్టోను ప్రకటిస్తామని సీఎం చెప్పారు. ఫిబ్రవరి నెల మొత్తమూ ప్రతి ఇంటికి వైసీపీ శ్రేణులు వెళ్లి మేనిఫెస్టోలో అమలు చేసిన కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం జగన్ పిలుపునిచ్చారు. ఇక మార్చి నెలలో ఎన్నికల సమరానికి పార్టీ నేతలంతా సంసిద్ధులు కావాలని జగన్ పిలుపునిచ్చారు. వైసీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు సమావేశానికి అధ్యక్షత వహించారు. తొలుత సభలో రాష్ట్ర మంత్రులు మేరుగు నాగార్జున, విడదల రజిని, వేణుగోపాలకృష్ణ, ఎంపీ మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, నాయకులు భాగ్యలక్ష్మి తదితరులు మాట్లాడారు. సీఎం జగన్ ప్రభుత్వ హయాంలో పేదలకు కొనసాగిన మేలును, సంక్షేమ పథకాలను వివరించారు.

చంద్రబాబుకు నిరాశ

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ మూడు కేసులపై హైకోర్టు ఇటీవల విచారణ పూర్తిచేసి తీర్పును రిజర్వు చేసి...నేడు తీర్పు వెల్లడించింది. ఏపీ రాజధాని నగరానికి సంబంధించిన బృహత్ ప్రణాళిక డిజైనింగ్, ఇన్నర్ రింగ్ రోడ్డు, దాన్ని అనుసంధానించే రహదారుల ఎలైన్‌మెంట్ వ్యవహారంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని వైసీపీ మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సీఐడీ గత ఏడాది మే 9న కొంతమందిపై కేసు నమోదు చేసింది. చంద్రబాబును మొదటి నిందితుడిగా సీఐడీ పేర్కొంది. ఈ కేసులో తనకు ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ చంద్రబాబు పిటిషన్ వేశారు. చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. సీఐడీ తరపున ఏజీ శ్రీరామ్ వాదించారు. రెండుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. అలాగే అంగళ్ల దాడుల కేసు, ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్లను హైకోర్టు తిరస్కరించింది.

ఏసీబీ కోర్టులోనూ బెయిల్ పిటిషన్ డిస్మిస్

స్కిల్ డెవలప్‌మెంట్ అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ పిటిషన్ దాఖలు చేసిన చంద్రబాబుకు మరోసారి నిరాశ ఎదురైంది. ఆయన దాఖలు చేసిన బెయిల్, కస్టడీ పిటిషన్లను న్యాయమూర్తి కొట్టివేశారు. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టు జడ్జి తీర్పు వెలువరించారు. మరోవైపు సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌ను కూడా న్యాయస్థానం కొట్టివేసింది.

రాష్ట్రానికి నీ అవసరం లేదు

జగన్ హయాంలో అభివృద్ధి శూన్యం

బీజేపీకి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు

రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-ఒంగోలు: అన్ని రకాలుగా రాష్ట్రాన్ని ధ్వంసం చేసిన జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా అవసరం లేదని ప్రజలు భావిస్తున్నారని, మరోసారి జగన్ రాష్ట్రానికి అవసరం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు నిధులు విడుదల చేసి మూడో గేటుతో పాటు మిగిలిన గేట్లకు మరమ్మతులు నిర్వహించాలని, కాలువలో నీటిపారుదలకు ఆటంకంగా ఉన్న తూటు, జమ్ము, చిల్ల చెట్లు తొలగించాలని డిమాండ్ చేస్తూ గుండ్లకమ్మ ఆయకట్టు రైతుసంఘం అధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు రామకృష్ణ సోమవారం ఒంగోలు విచ్చేశారు. ఈ సందర్భంగా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. 'రాష్ట్రానికి మీరు చేసిన అభివృద్ధి ఏమిటి? మిమ్మల్ని మళ్లీ ముఖ్యమంత్రిగా ఎందుకు కోరుకోవాలి' అనే ప్రశ్నలకు ముఖ్యమంత్రి జగన్ సమాధానం చెప్పాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేయడంలో, విధ్వంసం సృష్టించటంలో జగన్ ప్రధాన సూత్రధారి అని విమర్శించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు పదిసార్లు టెండర్లు పిలిచినా ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రాలేదని మంత్రి అంబటి రాంబాబు చెప్పటం చేతని వ్యాఖ్యానించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడో నెంబర్ గేటు కొట్టుకుపోయి ఏడాది దాటినా నిర్మాణంలో ఒక్క అడుగు ముందుకు పడకపోవడం జగన్ ప్రభుత్వం చేతకాని తనమేనన్నారు. ప్రతియేటా జనవరి ఒకటవ తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చిన జగన్ ఇప్పటివరకు ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. పైగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానం దేశానికే ఆదర్శమని, ఈ విధానాన్ని అన్ని రాష్ట్రాలు కాపీ కొట్టేందుకు సిద్ధపడుతున్నాయని చెప్పుకోవటం ప్రజలను మోసం చేయడమేనన్నారు. నాలుగున్నరేళ్లలో 6.40 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమై...ప్రైవేట్ వైపు అడుగులు వేయటం దేనికి సంకేతమని రామకృష్ణ ప్రశ్నించారు. రాష్ట్రానికి ఒక్క కొత్త పరిశ్రమ తీసుకురాకపోగా...అమర్‌రాజా, జాకీ, తైవాన్ పరిశ్రమలను జగన్ ప్రభుత్వం తరిమికొట్టిందని విమర్శించారు. జగన్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీకి తాకట్టు పెడుతున్నదన్నారు. విశాఖ ఉక్కు వంటి పరిశ్రమలను అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఏపీ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా బీజేపీ అడుగులు వేస్తున్నదని చెప్పారు. కర్నాటక ఎన్నికల సమయంలో ఎగువ భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడమే కాకుండా రూ.5,600 కోట్లు నిధులు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు తెలంగాణ ఎన్నికల వేళ ఏపీ ప్రయోజనాలను దెబ్బతీసేలా కృష్ణా జలాల పునఃపంపిణీకి తెర తీసిందన్నారు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం రాష్ట్రానికి 519 టీఎంసీలు, తెలంగాణకు 219 టీఎంసీల నీరు కేటాయింపులు జరిగాయన్నారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం కారణంగా రాష్ట్రం తమ నీటి వాటాను కోల్పోతుందన్నారు. ఈ నిర్ణయం జరిగేటప్పుడు ముఖ్యమంత్రి జగన్ ఢిల్లీలోనే ఉన్నారని, అయినా ఎటువంటి బెరుకులేకుండా కేంద్రం నిర్ణయం తీసుకోవడమంటే...జగన్‌ను మోదీ ప్రభుత్వం ఏ స్థాయిలో గౌరవంగా చూస్తుందో అర్థమవుతోందని రామకృష్ణ ఎద్దేవా చేశారు. కృష్ణా జలాలపై కేంద్రం నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల 18వ తేదీన కడపలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం కలిసి పోటీ చేసి ఘన విజయం సాధిస్తాయని తెలిపారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

7న ప్రజారక్షణ భేరి

19న ప్రజాప్రణాళిక విడుదల

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసమానతలులేని అభివృద్ధి కోసం సీపీఎం అధ్వర్యాన నవంబరు 7న విజయవాడలో ప్రజా రక్షణ భేరి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం విజయవాడ ఎంబీవీకేలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంఏ గఫూర్, డి.రమాదేవితో కలిసి రక్షణ భేరి లోగోను ఆయన ఆవిష్కరించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ నెల 19వ తేదీన ప్రజాప్రణాళిక విడుదల చేయనున్నామని తెలిపారు. ప్రజారక్షణ భేరికి ముందు రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి జాతాలు ప్రారంభమవుతాయని వివరించారు. మొదటి జాతా ఈ నెల 21న పార్వతీపురం జిల్లా సీతంపేట నుంచి, మరో జాతా 22వ తేదీన కర్నూలు జిల్లా ఆదోనీ నుంచి, 26న శ్రీకాకుళం జిల్లా మందస నుంచి ఒక జాతా ప్రారంభమవుతాయని వివరించారు. సీతంపేటలో బయలుదేరే యాత్ర పాలకొండ, కురుపాం, పార్వతీపురం, సాలూరు, గజపతినగరం, అరకులోయ, రంపచోడవరం, పోలవరం, ఏలూరు మీదుగా నవంబరు 1వ తేదీన విజయవాడ చేరుకుంటుందని తెలిపారు. మందస నుంచి బయలుదేరే జాతా టెక్కలి, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, నరసాపురం, భీమవరం, మచిలీపట్నం మీదుగా నవంబరు 3న విజయవాడ వస్తుందని చెప్పారు. ఆదోనీలో బయలుదేరే జాతా కర్నూలు, నంద్యాల, కడప, గుత్తి, అనంతపురం, హిందూపురం, మదనపల్లి, చిత్తూరు, తిరుపతి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, నరసరావుపేట, పర్చూరు, గుంటూరు మీదుగా నవంబరు 2వ తేదీన విజయవాడకు వస్తుందన్నారు. రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయం, ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ డిమాండ్లపై దారిపొడవునా ప్రజల్లో ప్రచారం నిర్వహిస్తుందని చెప్పారు. 2024 ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రాకుండా నిరోధించేందుకు లౌకిక ప్రజాస్వామ్య శక్తులను కూడగడుతామన్నారు. ముగింపుగా విజయవాడలో జరిగే సభకు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతారని చెప్పారు. కేంద్రం ప్రకటించిన మహిళా రిజర్వేషన్ అమలు జరగడం ఇష్టంలేకే వెంటనే అమలు చేయకుండా 2029 ఎన్నికల తర్వాత తీసుకొచ్చేలా నిర్ణయం చేశారన్నారు. మహిళలపై దాడులు, దూషణలు, వ్యక్తిత్వ హననం కొనసాగుతున్నాయని తెలిపారు. మహిళల హక్కులపై అధ్యయనానికి ఒక కమిటీ వేయాలని శ్రీనివాసరావు కోరారు.

వెలువోలు భానుమతికి సీపీఐ నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి: గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలో సోమవారం వెలువోలు భానుమతి సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా భానుమతి చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పూలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబం కోసం, పార్టీ కోసం చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాయకులు అంజిబాబు, అన్నవరపు ప్రభాకర్, నాగాంజనేయులు, కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, పుప్పాల సత్యనారాయణ, సురేశ్, గొట్టుముక్కల బాలాజీ, నార్ల వెంకటేశ్వరరావు, వై. చెంచయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, జాలాది జాన్ బాబు, కాబోతు ఈశ్వరరావు, పంతగాని మరియదాసు, బుర్ల శ్రీనివాసరావు, గంజి వెంకయ్య, గౌహర్ జానీ, ఎస్‌కే మదీనా బాబు, ఎస్‌కే కరిముల్లా, పొదిలి మరియదాసు, సీహెచ్ నిర్మల, జొన్నాదుల భారతి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే వలి, కళ్లం మోహన్ రెడ్డి, నూతక్కి శ్రీనివాసరావు, కళ్లం సత్యనారాయణ రెడ్డి, భీమిరెడ్డి రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

అటవీహక్కు, పట్టా సాధన కోసం ఉద్యమం

వ్యవసాయ కార్మిక సంఘం

రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2006/2007లో జారీ చేసిన అటవీహక్కుల చట్టపరిధిలో హక్కు పట్టాల సాధన కోసం గిరిజన సాగుదార్లు ఉద్యమాలకు సన్నద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్.కోటేశ్వరరావు గిరిజన సాగుదార్లకు పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో జరిగిన అటవీ బంజరు, గిరిజన సాగుదార్ల సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు పర్యావరణకు గానీ, ఇటు పేదల జీవనోపాధికి గాని ఉపయోగపడకుండా శతాబ్దాల తరబడి నిరుపయోగంగా ఉన్న లక్షలాది ఎకరాల అన్ని రకాల ప్రభుత్వ బంజరు భూములను నిరుపేద గిరిజన, దళిత, బడుగు బలహీన వర్గాల ప్రజల జీవనోపాధితో పాటు పచ్చదనం పెంపుదల, చెట్లు పెంచడం, పర్యావరణ పరిరక్షణలే లక్ష్యంగా 1970 నుంచి సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పేద ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ప్రత్యక్ష భూ ఆక్రమణోద్యమాలకు శ్రీకారం చుట్టి ఇప్పటికీ నిర్వహిస్తున్న భూపోరాటాల ఫలితంగా లక్షోపలక్ష భూమిలేని పేదలకు లక్షల ఎకరాల వివిధ రకాల ప్రభుత్వ బంజర్లను పంచిపెట్టడం జరిగిందని వివరించారు.

ఉవ్వెత్తున సాగిన ఈ భూపోరాటాల ఫలితంగానే 1973-74లో భూ సంస్కరణల చట్టం, ఆ తరువాత చెట్టు పట్టాల పథకం, ఆ తరువాత వన సంరక్షణ సమితులు(వీఎస్ఎస్) వచ్చినా వీటిని అమలు జరపటంలో పాలకులకు, అధికారులకు చిత్తశుద్ధి లేకపోవటం వల్ల ఆ చట్టాలు నీరుగారిపోతూ పేదలకు ఎండమావులుగానే మిగిలిపోయాయని తెలిపారు.

రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ భూపోరాటాలు ఉధృతంగా సాగుతున్న ఫలితంగా లక్షల ఎకరాలు పేదల సాగులోకి వచ్చి దశాబ్దాల తరబడి అనుభవిస్తున్నా ఉన్న చట్టాలు అమలుచేయటానికి పాలకులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవటం అత్యంత దారుణమని కోటేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. ఈ పరిస్థితుల్లో సాగుదార్లైన పేదలే పోరాటాలకు సిద్ధపడి సాధించుకోక తప్పదని పిలుపునిచ్చారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్ మాట్లాడుతూ. జిల్లాలోనూ, మైలవరం నియోజకవర్గంలోనూ నిర్వహించిన భూ పోరాటాలను వివరించారు. సీపీఐ విజయవాడ రూరల్ మండల కార్యదర్శి ఉప్పె నరసింహారావు, స్థానిక శాఖ కార్యదర్శి ఇస్లావతు బుడ్డియ, గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు భూక్యా దేశ్యానాయక్, బాలాజీ నాయక్, ఇస్లావతు పీకీ, తీర్పి, యానాది, ఎరుకల, లంబాడి కులాలకు చెందిన గిరిజనులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రపంచంతో పోటీ పడాలి

సీఎంను కలిసిన అమెరికాలో

పర్యటించిన విద్యార్థుల బృందం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రపంచంతో పోటీపడితేనే మన బతుకులు మారుతాయని, దీనికి విద్యే ఆధారమని, జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో అమెరికాలో పర్యటించిన ప్రభుత్వ విద్యార్థుల బృందం సోమవారం జగన్‌ను కలిసింది. ముందుగా విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సీఎం పరిచయం చేసుకున్నారు. అమెరికా పర్యటన ఎలా జరిగింది? అంటూ పిల్లలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వరల్డ్ బ్యాంక్, ఐఎంఎఫ్, కొలంబియా యూనివర్సిటీ, ఇంటర్నేషనల్ యూత్ కాన్ఫరెన్స్‌లో విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. ఆణిముత్యాలులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను 126 మందిని గుర్తించి వారికి పోటీ పరీక్ష నిర్వహించామని, వారి భాషాపరిజ్ఞానాన్ని కూడా పరిశీలించి చివరకు 10 మందిని ఎంపిక చేశామని తెలిపారు. నాడు-నేడు కార్యక్రమంతో మా పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని విద్యార్థులు చెప్పారు. తాము స్వేచ్ఛ కార్యక్రమం గురించి మాట్లాడగానే వివిధ దేశాలకు చెందిన వారంతా, ఈ కార్యక్రమంపై ఆసక్తి చూపారన్నారు. సీఎం జగన్ మాట్లాడుతూ అమెరికా పర్యటన ద్వారా ప్రపంచ వేదిక మీద అనేక అనుభవాలు నేర్చుకున్నారని చెప్పారు. ప్రపంచం ఎలా ఉంది?, మనం ఎలా నిలబడాలనే దానిపై చాలా అనుభవాలు ఈ పర్యటన ద్వారా వచ్చి ఉంటాయని భావిస్తున్నానని అన్నారు. విద్యార్థులు చూసిన కొలంబియా విశ్వవిద్యాలయం లాంటి చోట్ల 21 కోర్సులు ఇచ్చే అన్ని ప్రఖ్యాత ప్రపంచ కళాశాలల్లోనూ, మీకు ఎక్కడ సీటు వచ్చినా ఉచితంగా చదివిస్తామని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. విదేశీ విద్యాదీవెన కార్యక్రమం కింద మీకు సీటు వస్తే చాలు రూ.1.2 కోట్ల వరకూ ఫీజులను ప్రభుత్వమే చెల్లిస్తుందని, అలాంటి కళాశాలల్లో విద్యాభ్యాసం తర్వాత విద్యార్థులు బయటకు వచ్చాక మీలో ఒక విద్యార్థి ఆశించినట్టుగా సీఈఓలుగా ఎదుగుతారని సీఎం అన్నారు. ప్రతిభ, నైపుణ్యాలు ఇలాంటి కళాశాలల వల్ల విద్యార్థులకు అలవడతాయని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి సబ్జెక్టు మీద శ్రద్ధ ఉందో గమనించుకుని, సంబంధిత ప్రపంచస్థాయి కళాశాలలు ఎక్కడ ఉన్నాయనేదీ, అందులో సీటు కావాలంటే ఏ రకంగా సన్నద్ధం కావాలన్న విషయాల్లో విద్యార్థుల ఆలోచనలు ఉండాలన్నారు. జీఆర్ఈ, జీ మ్యాట్ లాంటి పరీక్షలనూ విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రతి విద్యార్థినీ చేయిపట్టి నడిపించడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని, విదేశీ విద్యాదీవెన ద్వారా సీటు సాధించడమన్నది ఈ పిల్లల లక్ష్యం కావాలని అన్నారు. ఈ విద్యార్థులకు నిరంతరం చేయూత అందించడానికి ప్రత్యేక అధికారిని నియమించి, వారి ద్వారా మార్గనిర్దేశం చేయాలని సీఎం ఆదేశించారు. మన పాఠ్యప్రణాళికలో లేని 1,800 సబ్జెక్టులను పాఠ్యప్రణాళికల్లోకి తీసుకువస్తున్నామని వివరించారు. ఎంఐటీ, హార్వర్డ్ లాంటి యూనివర్సిటీ నిపుణులచే తయారు చేయబడిన సబ్జెక్టులను ఇందులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ఈ పర్యటన మీకు మాత్రమే కాకుండా ఇతరులకూ స్ఫూర్తినిస్తుందని సీఎం జగన్ చెప్పారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలి

విశాలాంధ్ర-డోన్ రూరల్: కరోనా సమయంలో నిలిపివేసిన ప్యాసింజర్ రైళ్లను తిరిగి ప్రారంభించకపోవడంతో పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు కేవలం రెండు మాత్రమే ఉంటున్నందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎక్స్‌ప్రెస్ రైళ్లో జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని లెనిన్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం డోన్ రైల్వే జంక్షన్ మేనేజర్ జీ వెంకటేశ్వర్లుకు ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా లెనిన్ బాబు మాట్లాడుతూ ప్యాసింజర్ రైళ్లను పునః ప్రారంభించాలన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు సురక్షిత ప్రయాణం అందించగల రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు వందే భారత్ రైల్లో తిరిగే పరిస్థితి లేదని... వందే భారత్ టికెట్ ధరలు విమానాల టికెట్ల స్థాయిలో ఉన్నాయన్నారు. వందేభారత్ రైళ్లలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ధరలు నిర్ణయించాలని కోరారు. రైల్వే క్యాంటీన్, ప్యాంట్రీ కార్లలో పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని... రైల్వే కోచ్‌లు, టాయిలెట్స్ లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రయాణికుల భద్రతకు రైల్వే అధికారుల కృషి చేయాలన్నారు. కరోనా సమయం కన్న ముందు చాలా ఎక్స్ ప్రెస్ రైళు చాలా స్టేషన్లలో ఆగేవని... ఇప్పుడు కేవలం కొన్ని స్టేషన్లలో మాత్రమే ఆగుతున్నాయని తెలిపారు. లాభాలు వస్తున్న రైల్వే శాఖను సంస్కరణల పేరుతో ప్రైవేటీకరణ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచన దుర్మార్గమన్నారు. ఇప్పటికే చాలా రైల్వేస్టేషన్లో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వల్ల ప్లాట్‌ఫాం టికెట్ సుమారు రూ.50 వరకు పెంచి దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రైల్వే శాఖ ప్రైవేటీకరణ చేయడంతో ఉద్యోగాలు తగ్గడంతో పాటు రైల్వే చార్జీలు పెరుగుతున్నాయన్నారు. కేంద్రం ఇప్పటికైనా రైల్వే ప్రైవేటీకరణ యోచనను విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బొంతి రాళ్ల గ్రామ సర్పంచ్ జే రవి మోహన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రతాప్, నాయకులు విజయ్, రాఘవేంద్ర, దివాకర్, మనోజ్, రామ్మోహన్, రవి, శశి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

శ్లాబు రాయి మీదపడి విద్యార్థి దుర్మరణం

విశాలాంధ్ర-పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా): ప్రభుత్వ పాఠశాల వద్ద ఆడుకుంటున్న విద్యార్థి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన పాయకరావుపేటలో చోటు చేసుకుంది. పట్టణంలోని దుర్గాకాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదే కాలనీకి చెందిన తులసి సిద్ధూ ప్రసన్న (8) నాలుగో తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్న భోజనం అనంతరం పాఠశాల వెనుక భాగంలో విద్యార్థులు ఆడుకుంటున్నారు. నాడు నేడు పనుల్లో నిర్మిస్తున్న బాత్‌రూమ్‌కు చెందిన శ్లాబు రాయి మీద పడడంతో సిద్ధూ ప్రసన్న తీవ్ర గాయాలపాలయ్యాడు. తోటి విద్యార్థులు సమాచారం ఇవ్వడంతో హెచ్‌ఎం తల్లిదండ్రులకు సమాచారం అందించగా... వారు వచ్చి చికిత్స నిమిత్తం తుని ఆసుపత్రికి తరలించారు. సిద్ధూ ప్రసన్న అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అసలేం జరిగింది?: ఈ ఘటనపై మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) గాంధీ విచారణ చేపట్టారు. నాడు నేడు పనుల్లో భాగంగా నిర్మిస్తున్న బాత్‌రూమ్ శ్లాబు రాయికి కింద సపోర్టుగా పెట్టిన కర్రను విద్యార్థులు సతీష్‌కుమార్, వరుణ్, రాజకుమార్ అనే విద్యార్థులు పట్టుకొని తిప్పడంతో శ్లాబు రాయి ఊడి అదే సమయంలో అక్కడే ఆడుకుంటున్న తులసి సిద్ధూ ప్రసన్నపై పడింది. ఈవిషయాన్ని అదే పాఠశాలలో చదువుకుంటూ పక్కనే ఆడుకుంటున్న విద్యార్థి ఎంఈఓ విచారణలో తెలిపాడు.

హెచ్‌ఎం, మేస్త్రిపై చర్యలు తీసుకోవాలి

నిర్మాణాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థి మరణానికి కారకులైన పాఠశాల హెచ్‌ఎం, మేస్త్రిలపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ మల్లపురెడ్డి రమాకుమారి డిమాండ్ చేశారు. సంఘటన జరిగిన వెంటనే పాఠశాలను పరిశీలించిన ఆమె శ్లాబు రాయి పడకుండా ఉండడానికి చిన్నపాటి కర్రను పెట్టడం విచారకరమన్నారు. విద్యార్థులు అటువైపు వెళ్లకుండా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రమాకుమారి డిమాండ్ చేశారు.

ప్రాణం తీసిన పసరు వైద్యం

కామెర్లతో అన్నాచెల్లెళ్ల మృతి

విశాలాంధ్ర-కురుపాం: మన్యంలో మూఢనమ్మకాలకు వైద్యాధికారుల నిర్లక్ష్యం తోడవడంతో ఆదివాసీల నిండు ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. సరైన అవగాహన లేకపోవడంతో నాటు వైద్యాన్ని నమ్ముతుండటంతో ఏటా చిన్న చిన్న రుగ్మతలను సైతం తట్టుకోలేక గిరిబాలలు పదుల సంఖ్యలో మృత్యుఒడిని చేరుతూనే ఉన్నారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం లోని నీలకంఠాపురం పంచాయతీ పొలంగూడకు చెందిన ఇద్దరు చిన్నారులకు కామెర్ల వ్యాధి సోకి... సరైన వైద్యం అందక మృత్యు ఒడికి చేరుకున్న ఘటనే ఇందుకు నిదర్శనం. వివరాల్లోకి వెళ్తే... పొలం గూడ గ్రామానికి చెందిన కొండగొర్రి రమేష్ ,సుశీల దంపతులకు ముగ్గురు పిల్లలు. అందులో ఎనిమిదేళ్ల రాహుల్ (పుట్టుకతో మూగ ,చెవుడు) నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో మూడోతరగతి చదువుతున్నాడు. శ్రీ లేఖ(6)అదే ఊరిలో జి.పి. స్కూల్ లో చదువుతోంది. ఇద్దరు గత వారం రోజులుగా జ్వరం, పచ్చకామెర్లతో బాధపడున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి వైద్యం అందించాల్సిన తల్లితండ్రులు... సమీపగ్రామంలో నాటు వైద్యులు ఇచ్చిన పసరుమందు ను ఇద్దరికీ తినిపించారు. ఈ క్రమంలో వ్యాధి ముదరడంతో ఈనెల నాలుగో తేదీన శ్రీలేఖ ఇంట్లోనే మరణించింది. అప్పుడు స్పందించిన తండ్రి... రాహుల్‌ను గుమ్మలక్ష్మీపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఐదోతేదీన తీసుకుని వెళ్లారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో వైద్యం పూర్తి స్థాయిలో అందకముందే మృత్యుఒడి చేరాడు. చిల్లంగి అని రెండు రోజులు... నాటు వైద్యం పై నమ్మకంతో మరికొన్ని రోజులు నిర్లక్ష్యం చేయడంతో ఆ తల్లితండ్రులకు గర్భశోకాన్ని మిగిల్చింది. పసరు మందు బిడ్డలను పొట్టన పెట్టుకుందనీ ఆ పేద తల్లిదండ్రులు రోదించారు. ఇలాంటి దుస్సంఘటనలు మన్యంలో పరిపాటిగా మారిన క్రమంలో గిరిజన ప్రాంతాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలనీ గిరిజనులు కోరుతున్నారు. అలాగే స్వచ్ఛమైన తాగు నీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకో వాలని మొరపెట్టుకున్నారు. కురుపాం ఏటీడబ్ల్యూఓ కే చంద్రబాబు, నీలకంఠా పురం ప్రధానోపాధ్యా యులు ఏ గోవిందరావు,హెచ్‌డబ్ల్యూఓ పీ మల్లేష్, ఉపాధ్యాయుడు వీ తిరుపతి రావు మృతుల కుటుంబాన్ని పరామర్శించి... పదిహేను వేల రూపాయలు అందజేశారు.

మద్యం ద్వారా రూ. 94వేల కోట్లు దోచుకున్నారు

తెలుగు మహిళా నేత

వంగలపూడి అనిత

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రాన్ని మద్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చారనీ, మద్యం ద్వారా 94 వేల కోట్లు దోచుకున్నారని తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షులు వంగలపూడి అనిత విమర్శించారు. మద్య నిషేధంపై ముఖ్యమంత్రి మాట తప్పారని, మడమ తిప్పారని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.94 వేల కోట్లు మద్యం ద్వారా జగన్ దోచుకున్నారని ఆరోపించారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ నాసిరకం మద్యం ద్వారా ప్రాణాలు తీసుకుంటున్నారని, మద్య నిషేధం అమలు చేసిన తర్వాతే ఓట్లు అడుగుతామని అన్నారని, ఆ దమ్ము జగన్‌కు ఉందా? అని అనిత సవాల్ చేశారు. జగన్ మద్యం బ్రాండ్‌లలో విషతుల్యం ఉందని, లేబరేటరీలో నివేదికలు అవే చెబుతున్నాయన్నారు. కల్తీ మద్యం తాగి కాలేయం, కిడ్నీ సమస్యలు వస్తున్నాయని, నాలుగేళ్లలో ఎన్నో పుస్తులు తెగాయని అనిత ఆవేదన వ్యక్తం చేశారు. జనాలు తాగి పడిపోవాలి, చనిపోవాలనేది జగన్ ఉద్దేశం అని విమర్శించారు.

బస్సును ఢీకొన్న ఆటో: నలుగురి దుర్మరణం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : వైఎస్ఆర్ కడప జిల్లా యర్రగుంట్ల-ప్రొద్దుటూరు రహదారిలోని ఎస్.వి ఫంక్షన్ హాలు సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. కడప ఆజాద్‌నగర్‌కు చెందిన ఓ కుటుంబీకులు ఆటోలో ప్రొద్దుటూరు మీదుగా మల్లేలలోని దర్గాను సందర్శించేందుకు ప్రయాణమయ్యారు. అయితే వారు ప్రయాణిస్తున్న ఆటో ఎర్రగుంట్ల సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. పులివెందుల డిపోకు చెందిన శ్రీశైలం వెళ్లే బస్సును ఆటో వేగంగా ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగింది. సగం ఆటో బస్సు కిందికి వెళ్లింది. ఆటోలో మొత్తం పది మంది ప్రయాణిస్తుండగా, మహ్మద్ (25), హసీన (25), అమీనా (20), షాకార్ (14) అక్కడిక్కడే మృతి చెందగా, మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో ఆటోను మహిళ నడుపుతున్నట్లు సమాచారం. ముందు వెళుతున్న టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును వేగంగా ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఘటనా స్థలిలో చెల్లాచెదురుగా పడిన శవాలు, క్షతగాత్రుల హాహాకారాలతో ఆ ప్రాంతంలో భయానక స్థితి నెలకొంది. విషయం తెలుసుకొని ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఏఎస్ఐ రాజారెడ్డి, సిబ్బందితో అక్కడికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టారు. తొలుత క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తర్వాత మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటో ప్రమాద సమాచారం అందుకున్న జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ నాగరాజు, ఎర్రగుంట్ల మండల తహసీల్దార్ నాగేశ్వరరావు ప్రొద్దుటూరులోని ప్రభుత్వాస్పత్రికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వీరి ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత వైద్యులతో అధికారులు చర్చించారు. ప్రమాదం జరిగిన తీరుపై వారు ఎర్రగుంట్ల పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

హమాస్ ప్రతిఘటనోద్యమం

దీర్ఘకాలంగా రష్యా-ఉక్రేయిన్ మధ్య యుద్ధం ఆగిపోకముందే మళ్లీ పశ్చిమాసియాను యుద్ధం వెంటాడుతోంది. పలస్తీనా ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకోసం పోరాడుతున్న హమాస్ శనివారం ఇజ్రాయిల్ మీద భారీస్థాయిలో రాకెట్లు ప్రయోగించడం దుస్సాహసం కావచ్చు. అపారమైన ఆయుధ సంపత్తి, అన్నింటికన్నా మించి అమెరికా, యూరప్ దేశాల మద్దతు ఉన్న ఇజ్రాయిల్ పలస్తీనియన్లమీద బాహాటంగా యుద్ధమే ప్రకటించింది. హమాస్‌ను రూపుమాపుతామని ప్రతిజ్ఞ చేసింది. 1948కి ముందు ప్రపంచ రాజకీయ చిత్రపటంలో ఇజ్రాయిల్ లేనే లేదు. యూదులకు ప్రత్యేక దేశం ఏర్పాటు చేస్తామని పశ్చిమ దేశాలు మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన దశలో ప్రకటించాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరవాత 1948 మే 14న ఇజ్రాయిల్ యూదుల ప్రత్యేక దేశంగా నెలకొంది. అదీ పలస్తీనా గడ్డ మీదే. అప్పటి నుంచి ఇజ్రాయిల్ పలస్తీనియన్ల మీద అక్కసు తీర్చుకుంటూనే ఉంది. 1988 నవంబర్ 15న పలస్తీనా రాజ్యం ఏర్పడినా ఇజ్రాయిల్ కసితీరలేదు. పలస్తీనా పశ్చిమాసియాలో సార్వభౌమాధికారంగల దేశం. కానీ ఐక్యరాజ్యసమితి 2012 నవంబర్ 29న గానీ పలస్తీనాను గుర్తించనేలేదు. అయితే ఐక్యరాజ్యసమితిలో పలస్తీనాకు సభ్యత్వంలేదు. కేవలం పరిశీలక హోదానే దక్కింది. పలస్తీనా అస్తిత్వం కాపాడుకోవడంకోసం యాసర్ అరఫాత్ నాయకత్వంలోని ఫతా పోరాడింది. అరఫాత్ కూడా కొంతకాలం సాయుధ పోరాటం కొనసాగించినవారే. ఆ తరవాత సంప్రదింపులే మేలు అనుకున్నారు. అదే సమయంలో హమాస్ అస్తిత్వంలో ఉంది. కానీ పోరాటమే శరణ్యం అని విశ్వసిస్తుంది. దాష్టీకం చెలాయించే వారికి అది తీవ్రవాదంగా తోచవచ్చు. ఇజ్రాయిల్ అణచివేత చర్యలకు లోనైనవారు కొంత దుడుకుగా వ్యవహరించడంలో ఆశ్చర్యంలేదు. 2004లో అరఫాత్ మరణం తరవాత హమాస్ బలం పుంజుకుంది. పలస్తీనా అస్తిత్వాన్ని ఇజ్రాయిల్ ఇప్పటికీ గుర్తించడం లేదు. తమ భూభాగ పరిధిని క్రమంగా విస్తరిస్తోంది. పలస్తీనా భూభాగాలను విచక్షణారహితంగా ఆక్రమిస్తోంది. గాజా నది పశ్చిమ తీరాన యూదులను దింపుతోంది. పలస్తీనియన్ల ఆగ్రహానికి ఈ దురాగతాలే ప్రధాన కారణం. దేశ ప్రధాని నెతన్యాహూ నాయకత్వంలోని ఇజ్రాయిల్ ప్రభుత్వం అత్యంత మితవాద ప్రభుత్వం. హమాస్‌ను ఇజ్రాయిల్ తీవ్రవాద సంస్థ అంటోంది కానీ ఇజ్రాయిల్ దేశమే ప్రపంచంలోకెల్లా అత్యంత తీవ్రవాద రాజ్యం. తమ ప్రజలకు, కడకు న్యాయవ్యవస్థకూ స్వేచ్ఛ అనుమతించదు. ఇటీవలే పార్లమెంటు రూపొందించే శాసనాలను సమీక్షించే అవకాశం న్యాయవ్యవస్థకు లేకుండా చేయడానికి ఒక చట్టమే తీసుకొచ్చారు.

యుద్ధంలో తటస్థత అసాధ్యం. అందరూ ఏదో ఓ పక్షాన చేరిపోతారు. యుద్ధం నివారించి శాంతి నెలకొనాలని కోరుకునేవారూ ఉంటారు. ఘర్షణలకు కారణాలు అన్వేషించి మాట్లాడేవారు పరిమితంగానే ఉండొచ్చు. బలవంతుడు బలహీనుణ్ని అణచి వేయాలన్న దృష్టితోనే ఉంటాడు. ఇజ్రాయిల్ ఆయుధ సంపత్తిలో మేటి. అలాంటి దేశంతో హమాస్ ఘర్షణకు దిగడం సాహసమే. 1948 మే 14 దాకా ప్రపంచ రాజకీయ చిత్రపటంలో కనిపించని ఇజ్రాయిల్ పలస్తీనియన్ల మీద దశాబ్దాలుగా కక్ష తీర్చుకుంటూనే ఉంది. నిరంతర అణచివేతకు, హత్యలకు, చిత్రహింసలకు, దురాక్రమణకు గురైన పలస్తీనా ప్రజలది నిజానికి ధర్మాగ్రహం. ఇజ్రాయిల్ ధోరణి పలస్తీనియన్లను ప్రతిఘటించక తప్పనిస్థితికి నెట్టేశాయి. నిస్సహాయంగా మిగిలిపోయినవారి ప్రతిఘటనలో తీవ్రవాద పోకడలు ఉండొచ్చు. దీన్ని ఖండించవలసిందే. కానీ హమాస్‌ను నామ రూపాలు లేకుండా చేస్తామన్న ఇజ్రాయిల్ అధినేత నెతన్యాహూ ప్రకటనల ఆంతర్యాన్నీ గమనించవలసిందే. ఇజ్రాయిల్‌కు యుద్ధ విమానాలు పంపడానికి అమెరికా సన్నద్ధం అయింది. తన గడ్డమీద ఎన్నడూ యుద్ధం చేయని అమెరికా ప్రపంచంలో ఎక్కడ ఘర్షణ జరిగినా అమెరికా ఏదో ఒక పక్షాన చేరిపోయి ఆ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొనని సందర్భాలలో కూడా దురాక్రమణదారులకు, జాతి వివక్ష కొనసాగించే దేశాలకు సకలవిధ సహాయం అందిస్తుంటుంది. హమాస్‌ను ఖండించే దేశాలు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ దాడిని మెచ్చుకునే దేశాలు కొన్నైనా మిగిలాయి. హమాస్ ఇలా తిరగబడడానికి కారణం ఏమిటి అని ఆలోచించే వారి సంఖ్య పరిమితం అయిపోయింది. నిస్సహాయంగా మిగిలినవారు ఆగ్రహావేశాలకు లోనుకావొచ్చు. కొన్నిసార్లు అది తీవ్రవాదంగా కనిపించనూవచ్చు. తమ న్యాయమైన హక్కులకోసం పోరాడే వారు విధిలేని పరిస్థితుల్లో తీవ్రవాద కార్యకలాపాలకూ పాల్పడవచ్చు. అయితే ఆ తీవ్రవాదానికి మూలాలు వెతకడం వివేచనాపరులకు ఉండవలసిన లక్షణం. హమాస్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఆయుధాలు ప్రయోగించడం, సాయుధ డ్రోన్లను ఉపయోగించడం ఇదే మొదటిసారి. హమాస్‌కు మద్దతుగా ఇజ్రాయిల్ ఉత్తర సరిహద్దు లెబనాన్ నుంచి పనిచేసే హెజ్బుల్లా సంస్థ కూడా రాకెట్లు ప్రయోగిస్తుంది. హమాస్‌కు సంఘీభావం తెలపడానికే తాము రాకెట్లు ప్రయోగించామని హెజ్బుల్లా అంటోంది. ఈ సంస్థకు ఇరాన్ మద్దతుఉంది. ఇజ్రాయిల్ హమాస్ మీద యుద్ధం ప్రకటించిన తరవాత ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు పెరిగిపోయాయి. తమ మీద జరిగిన దాడిని ఇజ్రాయిల్ 2001 సెప్టెంబర్ 11న అమెరికా జంట హార్మ్యాల మీద జరిగిన దాడితో, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికాలోని పర్ల్ హార్బర్‌మీద జరిగిన దాడితో పోలుస్తోంది. అమెరికా యుద్ధ నౌకలకు భయపడడం అని హమాస్ ప్రకటించడం వెనక పలస్తీనా ప్రజల వేదనే ఎక్కువగా కనిపిస్తుంది. ఏ యుద్ధంలోనూ విజేతలు ఉండరు. గెలిచిన పక్షం కూడా అనేక విషయాల్లో పరాజితంగానే మిగులుతుంది. రెండు వేపులా శవాల గుట్టలే కనిపిస్తాయి. సుదీర్ఘ కాలంపాటు మన దేశం పలస్తీనా ప్రజలకు అండగా ఉండేది. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చినె తరవాత ఇజ్రాయిల్ కు అనుకూలంగా నడుచుకోవడం ఇతర జాతులవారిని కాల్చుకుతినేవారి పక్షాన నిలవడమే. మరోవేపు వేపు సౌదీ అరేబియా లాంటి దేశాలను ఇజ్రాయిల్‌తో సన్నిహిత సంబంధాలు పెట్టుకోవాలని ఒత్తిడి చేస్తోంది. హమాస్ ఐ.ఎస్.ఎస్.ఐ.ఎస్.కన్నా కిరాతకమైందని, వందలాది మంది ఇజ్రాయిలీలను హతమార్చిందని, అనేక మందిని బందీలుగా పట్టుకుందని ఇజ్రాయిల్ రక్షణ శాఖ అంటోంది. పలస్తీనియన్లమీద మరోసారి దాడికి కృతనిశ్చయంతో ఉన్నామని, తమ దాడులు వెంటనే ఆగవు అని కూడా చెప్తోంది. తాము పలస్తీనియన్లను పెడుతున్న హింస గురించి మాత్రం మాట్లాడదు. హమాస్ దాడి తీవ్రవాదంగా కనిపిస్తున్నప్పుడు ఇజ్రాయిల్ అకృత్యాలను వెనకేసుకురావడం అణచివేసే వారిని సమర్థించడమే అవుతుంది. యుద్ధాన్ని ఎవరూ సమర్థించకూడదు. కానీ ఈ భూగోళానికే పెద్దన్నను అని భావించే అమెరికాకు, యూరప్ దేశాలకు, ఆయుధాలు ఎగుమతి చేసే దేశాలకు యుద్ధమే లాభసాటి వ్యాపారం.

కొత్త ట్రిబ్యునల్ నియమించాలి

వి. శంకరయ్య

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏలాగూ మాట్లాడరు. కనీసం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అయినా కొత్త ట్రిబ్యునల్ నియామకంపై సుప్రీం కోర్టుకు వెళతామని చెప్పినందుకు సంతోషించాలి. ఎందుకంటే ఇది స్వయంకృతం. గత జల సేతు బంధమే. 2020 లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఇందుకు బీజంపడింది. రెండు రాష్ట్రాల మధ్య నీటి వాటాలు పంచమని కేంద్ర ప్రభుత్వానికి రాసిన లేఖలకు స్పందనలేదని 2015 లో తెలంగాణ సుప్రీంకోర్టులో కేసు వేసింది. ఆపాటికే కృష్ణా జలాలు పంపకంపై చాలా కేసులు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో వున్నాయి. ఆ మాట కొస్తే ఇంకా అవన్నీ విచారణ నోచుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన కేసు ఉపసంహరించుకొంటే కొత్త ట్రిబ్యునల్ వేస్తామని అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేంద్రమంత్రి షెకావత్ ప్రతి పాదించారు. ఆ రోజునే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈ ప్రతిపాదనను వ్యతిరేకించి అసమ్మతి నోట్‌పెట్టి వుంటే ట్రిబ్యునల్ ప్రతిపాదన పురిటిలోనే సంధి కొట్టేది. ఏకాభిప్రాయం వుంటే తప్ప కేంద్ర మంత్రి షెకావత్ ఆమోదించేవారుకాదు. ఆ రోజు తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ ను ముఖాముఖిగా వ్యతిరేకించ లేక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మౌనం పాటించిన ఫలితంగా నేడు ఆంధ్ర ప్రదేశ్‌కు సరిదిద్దలేని నష్టం కలుగుతోంది. రేపు సుప్రీంకోర్టులో కూడా తెలంగాణ లాయర్ ఈ అంశం లేవనెత్తితే ఆంధ్ర ప్రదేశ్ తరపున ఏమని సమాధానం చెబుతారో మంత్రి రాంబాబు వివరించి వుండవలసివుంది.

వాస్తవంలో 2019 ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవి చేపట్టిన జగన్మోహన్ రెడ్డి అంతర్ రాష్ట్ర జలవివాదంలో వ్యవహరించిన తీరు తెలంగాణకు మేలు చేసే విధంగానూ ఆంధ్రప్రదేశ్‌కు అపకారం కలిగించే విధంగా వుంది. 2016 లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టు బట్టి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలతోపాటు దిండి ఎత్తిపోతల పథకాలను కొత్త ప్రాజెక్టులుగా అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయించారు. నిర్మాణం నిలుపుదల చేయాలని తీర్మానించారు. రాష్ట్ర విభజన చట్టం మేరకు విభజన తర్వాత ఏ రాష్ట్రంగాని నిర్మాణం చేపట్టే పథకం అపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందాలి. 2016 నాటి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కొత్తదని చేసిన తీర్మానాన్ని గురించి 2020 లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏమాత్రం పట్టుబట్ట లేదు. పైగా కొత్త ట్రిబ్యునల్ నియామకం గురించి అభ్యంతరమూ వ్యక్తం చేయ లేదు. ఫలితంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కొత్త ప్రాజెక్టుకాకుండా పోయింది. అపెక్స్ కౌన్సిల్ ఆమోదంలేకనే పాత ప్రాజెక్టుగా పరిగణించడంతో పర్యావరణ అనుమతులు లభించాయి. ఇక మిగిలింది డిపిఆర్ ఆమోదం ఒక్కటే. ఇదే జరిగితే శ్రీ శైలం జలాశయం నుండి 90 టియంసిల నికర జలాలు తెలంగాణకు దఖలు పడతాయి. కెసిఆర్ జగన్మోహన్ రెడ్డి ఇద్దరిమధ్య ఏం లావాదేవీలు వున్నాయో ఏమో కాని కెసిఆర్ చాకచక్యంగా వ్యవహరించి అటు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతోపాటు కొత్త ట్రిబ్యునల్ నియామకంలో ఆంధ్రప్రదేశ్ నుండి ఎట్టి అభ్యంతరాలు లేకుండా చూచుకొని అవి సాధించుకున్నారు.

ఒక వేళ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో భిన్నంగా జరిగి వుంటే కౌన్సిల్ సమావేశం మినిట్స్ బహిర్గతం చేస్తే రాష్ట్ర ప్రభుత్వానికి అపవాదు తప్పుతుంది. రేపు సుప్రీంకోర్టులో కేసుకు బలమైన సాక్ష్యం లభిస్తుంది.

ఇవేకాదు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌తో కొన్నాళ్లు బహిరంగంగా ఆలాయ్ బలాయ్ సాగించారు. గోదావరి కృష్ణ నదుల అనుసంధానం చేసి రెండు రాష్ట్రాలను సస్యశ్యామలం చేస్తామని ఇరువురు నేతలు నమ్మబలికారు రెండు రాష్ట్రాల ఇంజనీర్లు పలుమార్లు సమావేశమయ్యారు. ముఖ్యమంత్రులు ఇరువురు రెండు సమావేశాలు నిర్వహించారు. శ్రీ శైలం వద్ద 400 టియంసిలే లభ్యమౌతాయని గోదావరి నుండి 900 టియంసిలు తరలించి మొత్తం 1300 టియంసిలను రెండు రాష్ట్రాలకు వాడుకోవాలని తెలంగాణ ఇంజనీర్లు ప్రతి పాదించారు. గమనార్హమైన అంశమేమంటే చాల మందికి ఆనాటి విషయాలు గుర్తు వుండక పోవచ్చు. తుదకు శ్రీ శైలం జలాశయంనుండి సోమశిలకు నీరు ఇచ్చేందుకు తెలంగాణ ఇంజనీర్లు అభ్యంతరం పెట్టి సాగర్ నుండి తీసుకోవాలని ప్రతి పాదించారు. అయితే తుదకు ఈ ప్రతిపాదన కెసిఆర్ వదులు కున్నారు. లేకుంటే గోదావరి మిగులు జలాలు తెలంగాణకు దక్కేది. ఈ లోపు గోదావరిపై తన ప్రాజెక్టులకు ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆంధ్ర ప్రదేశ్ నుండి అభ్యంతరాలు లేకుండా కెసిఆర్ చూచుకున్నారు. కౌన్సిళ్లు ట్రిబ్యునల్స్ వద్ద మేమిద్దరమే ముద్దని సాగినరోజుల్లో నిత్య క్షామపీడిత ప్రాంతమైన రాయలసీమకు అవసరమైన గుండ్రేవుల రిజర్వాయర్‌కు తెలంగాణ నుండి అభ్యంతరాలు లేకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనుమతి పొందలేక పోయారంటే వీరిద్దరి స్నేహం గురించి ఏమని భావించాలి. మరోవేపు ఆంధ్రప్రదేశ్‌లో జరగాల్సిననష్టం జరిగిపోయింది.

తెలుగు దేశం హయాంలో గోదావరి బేసిన్ నుండి కృష్ణ బేసిన్ కు తెలంగాణ 240 టియంసిల నీరు తరలించుతున్నదని గోదావరి బోర్డుకు ఏపీ ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు కేంద్ర జలవనరులశాఖ వద్దకు చేరింది. ఈ సమయంలో ఏపీలో ప్రభుత్వం మారడం ముఖ్యమంత్రులు స్నేహంగా వుండటం పైగా గోదావరి కృష్ణనదుల అనుసంధానం తెరమీదకు రావడంతో తదుపరి జరిగిన గోదావరి బోర్డు సమావేశాల్లో ఎపి అధికారులు ఏం మాట్లాడాలో తెలియక మౌనం పాటించడంతో ఆ ఫిర్యాదుకు కాలదోషం పట్టింది. ఈ రోజుకు కాకతీయ కాలువ ద్వారానూ కాళేశ్వరం ద్వారా గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు తెలంగాణ నీళ్లు తరలించుతోంది. మరో వైపు గొంతెండి పోతున్న రాయలసీమకు సాక్షాత్తు బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన నికర జలాలపై పెద్ద యాగీ చేస్తోంది. బేసిన్ సమస్య ముందుకు తెచ్చి కృష్ణ జలాలు సీమకు వాడుకోకూడదని గోల చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం కూడా ఎన్నికల తాయిలంగా ట్రిబ్యునల్ నియామకం చేసిందని తెలంగాణ మీడియా కూడా రాసింది. తెలంగాణలో తాము అధికారంలోకి రావడానికి కేంద్ర బిజెపి పెద్దలు ట్రిబ్యునల్ నియామకంచేసి నట్లుంది. కేంద్రం కక్ష కట్టినా కెసిఆర్ జగన్మోహన్ రెడ్డిని బుట్టలో వేసుకొని కుయుక్తులతో వివిధఅంశాల్లో విజయం సాధించినా రాష్ట్ర విభజనచట్టం ఆంధ్ర ప్రదేశ్‌కు కొంతమేర రక్షణ కవచంగా వుంది. రెండు రాష్ట్రాల మధ్య ఏ సమస్య పరిష్కారం కావాలన్నా రాష్ట్ర విభజన చట్టం మేరకే వుండాలి. విభజన చట్టం సెక్షన్ 89 మేరకు ట్రిబ్యునల్ విచారణ జరుపుతుంటే మరో ట్రిబ్యునల్ నియామకం ఏలా చెల్లు బాటు అవుతుంది? . అంతేకాదు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌తీర్పు నోటిఫై చేయాలని కర్నాటక ప్రభుత్వం వేసిన కేసు ఇటీవల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయ మూర్తి తెలంగాణ లాయర్‌ను ఉద్దేశించి ఉమ్మడి రాష్ట్రంలో వచ్చిన తీర్పు విభజన తర్వాత ఏలా ఆక్షేపిస్తారని నిలదీశారు. అంతటితో ఆగకుండా విభజన తర్వాత తెలంగాణ విస్తీర్ణం ఏమీ పెరగ లేదు కదా అని తెలంగాణ లాయర్ ను ప్రశ్నించారు. బచావత్ ట్రిబ్యునల్ కూడా కొన్ని రక్షణలు కల్పించింది. ఈ పరిస్థితుల్లో వున్న చిక్కుల్లా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో న్యాయ పోరాటం చేయడమే.

విశ్రాంత పాత్రికేయులు 9848394013

స్వచ్ఛభారత్ !

చింతపట్ల సుదర్శన్

తెల్లారిందో లేదో దీని గోల మొదలైంది అని విసుక్కుంటూ నిద్రలేచింది డాంకీ. నిలబడి అదేపనిగా అరుస్తున్నది డాగీ. దీని ముక్కు షార్పు దీనికళ్లు 'లెన్స్‌కార్ట్' . లెన్సుల కంటే పవర్ ఫుల్. ఇక దీని అరుపు చెప్పనే అక్కర్లేదు. పొద్దున్నే ఎవడు కనిపించాడో అనుకుంటూ ఏంటి బ్రో పొద్దున్నే సుప్రభాత గీతం వినిపిస్తున్నావు అంది డాంకీ. సుప్రభాతాలు, బినాకా గీత మాలాలు, వివిధభారతి కేకలు పాతబడ్డాయన్న టీవీలు, సెల్లులు 'అలెక్సా'లు వచ్చాక. పొద్దున్నే ఓ గుంపు అరుగు పక్కనించి వెళ్తుంటే మెలకువ వచ్చింది. వీళ్లెవరు దండుపాళ్యం గ్యాంగా, చెడ్డీ గ్యాంగా అర్థంకాక ఎందుకైనా మంచిదని అరుస్తున్నా.

ఎవరు వాళ్లు అంటూ డాంకీ అడుగు చివరిదాకా వచ్చి చూసింది. వాళ్ళ చేతుల్లో చీపుర్లూ, బకెట్లూ, బ్రష్షులూ కనిపించాయి. వీళ్లా వీళ్లెవరనుకున్నావు. మన ప్రియతమ నాయకులు స్వచ్ఛభారత్ ప్రోగ్రాం నిర్వహణకు వెళ్తున్నట్టున్నారు. చేతుల్లో చీపుర్లు కనపడ్డం లేదూ అంది డాంకీ. దొంగల గుంపు కాదన్నమాట. అనవసరంగా స్వరపేటిక ఖర్చుపెట్టేశాను. జీవితంలో ఒక్కసారన్నా ఒక్క దొంగనా కొడుకు కాలి పిక్కన్నా కొరకలేకపోయాను అంటూ నిట్టూర్చింది డాగీ. నీ దృష్టి

రంగస్థలం

ఎప్పుడూ దొంగల మీదా కాలిపిక్కల మీదేనా? అరుపులు ఆపి కుదురుగ్గా కూచో అంతేకద మరేం చేస్తాను. ఇంతకూ ఈ చీపురు కట్టలతో ఏం చేయబోతున్నారు. ఒకళ్ల కొకళ్లు చీపుళ్లతో చీప్‌గా బాదుకుంటారా అంది డాగీ.

చీపుళ్లు బాదుకోడానికి కాదు ఊడ్చుకోడానికి. వీళ్లంతా ఆపని మీదే వచ్చారు. గల్లీ గల్లీ వాడ వాడ ఊరు ఊరు ఊడ్చి పారేస్తారు. ఊడ్చి పారేయడమంటే శుభ్రం చేసేయడన్నమాట. అంటే అన్ని చోట్లా ఊడ్చి చెత్తపోగేస్తారన్నమాటం. మరి మన ఈ కూలిన కొంప కూడా కాస్త ఊడ్చి శుభ్రం చేసిపోతే బాగుణ్ను అంది డాగీ.

ఆశదోశ అప్పడం వడ అన్నారు. కూలిన కొంపలు వాళ్లకెందుకు? స్వచ్ఛ భారత్ అంటే మొత్తం భారతదేశాన్ని ఊడ్చి, తుడిసి, కళ్లాపి జల్లి చుక్కల ముగ్గులు పెడతారన్నమాట అంది డాగీ. కొంపలు కూలుస్తారుగానీ కూలిన కొంపలు శుభ్రం చెయ్యరు కాబోలు అయినా ఈ చీపుళ్ల దేశం మొత్తాన్ని ఊడ్చి శుభ్రం చేస్తామంటే నమ్మలేకపోతున్నా అంది డాగీ. చిన్న చితక దేశమా ఇది. ఆసేతు హిమాచలం కాదా. తొమ్మిదేళ్ళ నుంచీ ఊడుస్తూనే ఉన్నారు. అయినా శుభ్రం కాలేదు మరి అంటూ నవ్వుతూ అరుగుఎక్కాడు అబ్బాయి. ఎన్నడూ లేంది పొద్దున్నే వచ్చావేమిటన్నా అన్నది డాగీ. సన్నబడదామని వాకింగుకు వచ్చా అన్నాడబ్బాయి. ఈ దేశంలో తిండి కరువైన వాళ్ళకన్నా తిండి ఎక్కువైన వాళ్ళకే జబ్బులు ఎక్కువవుతున్నాయంట గదా. నీకెందుకన్నా ఉద్యోగం సద్యోగం లేదని ఇంట్లో తిండి సరిగ్గా పెట్టడం లేదన్నావు గదా అంది డాంకీ. అదిసరేగానీ అన్నా తొమ్మిదేళ్ళ నుంచీ మనవాళ్ళు అదేపనిగా ఊడుస్తున్నా ఇంకా స్వచ్ఛ భారత్ కాలేదా అనడిగింది డాగీ. ఎలా అవుతుంది... పరిసరాలు మాత్రమే పరిశుభ్రంచేస్తే సరిపోతుందా. చేసినా చెత్త మళీమళ్లీ పేరుకు పోయేదేకద. ఎలుక తోలు తెచ్చి ఎన్నాళ్ళు ఉతికినా నలుపు నలుపే కాని తెలుపు కాదు అన్నది విన్లేదా. ముందు మనుషులు శుభ్రపడాలి. అప్పుడే నిజమైన స్వచ్ఛభారత్‌ను చూడగల్గుతాం అన్నాడబ్బాయి. మనుషులకేమైందన్నా ఖరీదైన బట్టలే తొడుగుతున్నారు. ఏ పార్టీ వాళ్ళు ఆ పార్టీ కండువాలు వేసుకు తిరుగుతున్నారు కదా అంది డాగీ. పైకి తెల్లటి బట్టలు వేసుకుంటే లోపల మురికి ఎక్కడికి పోతుంది. చాకిరేవు కాడ బండకేసి బాదేవాడు లేక తైతక్క లాడుతున్నారు . ఎవడి మురికి వాడి దగ్గరే పెట్టుకుని శుభ్రతగురించి, స్వచ్ఛత గురించి మాట్లాడతారేమిటన్నా అంది డాంకీ.

బాగా అన్నావు కడగాలంటే కుల విద్వేషాలను కడగాలి. మత వైషమ్యాన్ని ఉతికి ఆరేయాలి. చిన్నస్థాయినుంచి పెద్దస్థాయిదాకా నీతి తప్పిన వాళ్ళందర్నీ గంగలో ముంచాలి అన్నాడబ్బాయి. అవును బ్రో.. ధనవంతుల్ని ఇంకా ధనవంతుల్ని చెయ్యాలి. కోట్ల రుణాలు మాఫీ చెయ్యాలి, అప్పులు ఎగ్గొట్టే వాళ్లకు విదేశాల్లో సౌకర్యాలు ఏర్పాటు చెయ్యాలి అంది డాగీ. ఏ ఏం మాట్లాడుతున్నావు అని కసిరింది డాంకీ. నేను చెప్పినవి చేసి స్వచ్ఛ భారత్ సాధించాలను కుంటున్నారేమో మరి అంది డాగీ నాలుక మడతేసి కన్ను కొడుతూ.

స్వచ్ఛ భారత్ సాధించడానికి తొమ్మిదేళ్ళు సరిపోలేదా. మరో పాతికేళ్ళు అవసరమేమో అంది దాంకీ పళ్లు ఇకిలిస్తూ. ముఖ్యమంత్రుల్ని, ప్రధానమంత్రుల్ని శాశ్వత ముఖ్యమంత్రుల్నీ, శాశ్వత ప్రధాన మంత్రుల్ని చేసేస్తే స్వచ్ఛ భారత్ వచ్చి తీరతుంది అంది డాగీ తోక ఎగరేస్తూ. ఎన్నికలు వస్తున్నాయని నోర్లు పారేసుకుంటున్న నాయకులంతా 'లిసరిన్'తో నోర్లు కడుక్కోవడం అన్నిటికంటే ముఖ్యం అన్నాడు అబ్బాయి.

ఆశా వర్కర్ల బాధలు పట్టని పాలకులు

దుర్గం రవీందర్

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్న ఆశ (అక్రిడేటెడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్) వర్కర్లు చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరి చేస్తున్నారు. పనికి తగ్గ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తున్నా కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వేతనాల పెంపు, ఇతర హక్కులను సాధించుకునేందుకు వివిధ జిల్లాల్లో ఆశ వర్కర్లు దాదాపు 15 రోజులు సమ్మె చేశారు. అనేక రకాల సేవలు అందిస్తున్నా వీరికి ప్రభుత్వం వివిధ హామీలు ఇచ్చినా అమల్లోకి రాలేదు. వర్షాకాలంలో జ్వరాలు ప్రబలినప్పుడు ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించి వారికి మందులు ఇస్తారు. అవసరమున్నవారిని ఆయా ఆసుపత్రులకు పంపిస్తారు. ప్రాణాంతకమైన కరోనా వైరస్‌వ్యాప్తి చెందిన సమయంలో బాధితుల ఇళ్లకువెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని మందులు ఇస్తారు.

కంటి వెలుగు కార్యక్రమం సందర్భంగా ఆరునెలలు విధులు నిర్వహించినా ప్రభుత్వం అదనంగా ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఆశ కార్యకర్తలుగా కొనసాగుతున్న వారికి సంక్షేమ పథకాలను వర్తించడంలేదు. ఇలా 18 ఏళ్లగా చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న ఆశ వర్కర్లు ఏదో ఒకరోజు ప్రభుత్వం తమ సేవలను గుర్తించి తమ సమస్యలను తీర్చకపోతుందా అనే ఆశతో పనిచేశారు. ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో ఇప్పుడు సమ్మె చేస్తున్నారు. మాత, శిశు మరణాలు తగ్గించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేదిశగా 2006లో ఆశ వర్కర్లను నియమించారు. ప్రతి వెయ్యిమంది జనాభాకు ఒక ఆశ కార్యకర్తను నియమించారు. దేశంలోని జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్‌లో భాగంగా ప్రతి గ్రామానికి శిక్షణ పొందిన మహిళా సామాజిక ఆరోగ్య కార్యకర్త ఆశాను నియమించారు. ఆ గ్రామం నుండే ఆశా వర్కర్‌ను ఎంపిక చేస్తారు.

25 నుండి 45 సంవత్సరాల వయస్సుగల మహిళ అయిఉండాలి. కనీసం పదివరకు చదవాలి. ఈ అర్హతగల మహిళ అందుబాటులోలేని గ్రామాల్లో దీనిని సడలించారు. ఊరిలో వివిధ కమ్యూనిటీ గ్రూపులు, స్వయం సహాయక బృందాలు, అంగన్వాడీ సంస్థలు, బ్లాక్ నోడల్ అధికారి, జిల్లా నోడల్ అధికారి, గ్రామ ఆరోగ్య కమిటి, గ్రామసభ ద్వారా వీరిని ఎంపిక చేశారు. దేశంలో 10 లక్షల మంది ఆశాలున్నారు.

తెలంగాణాలో దాదాపు 27 వేల మంది ఉన్నారు. వీరిలో అత్యధికులు బహుజన కులాలవారే ఉన్నారు. వీరికి మొదట ఇచ్చిన శిక్షణ కాకుండా అవసరాన్ని బట్టి మధ్యలో రకరకాల శిక్షణ ఇస్తారు. పోషకాహారం, ప్రాథమిక పారిశుధ్యం పరిశుభ్రమైన పద్ధతులు, ఆరోగ్యకరమైన జీవనం, పని పరిస్థితులు, అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య సేవలపై సమాచారం, వంటి వాటిపై గ్రామస్తులకు సమాచారాన్ని అందిస్తారు. సాధారణ పనులతోపాటు యూనివర్సల్ ఇమ్యునైజేషన్, రిప్రొడక్టివ్ చైల్డ్ హెల్త్ (=జఎ) మరియు ఇతర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం రిఫరల్, ఎస్కార్ట్ సేవలను వీరు అందిస్తున్నారు. డ్రగ్ కిట్తో ప్రతి ఆశా గ్రామంలోని ప్రజారోగ్య కార్యక్రమాలలో పాల్గొంటుంది. పలు రకాల రోగ నివారణ సంరక్షణల కనీస ప్యాకేజీని అందిస్తుంది.

అంగన్వాడీ, సబ్ సెంటర్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఇమ్యునైజేషన్, యాంటీ నేటల్ చెకప్, పోస్ట్ నేటల్ చెకప్ సప్లిమెంటరీ న్యూట్రిషన్, శానిటేషన్ వంటి ఆరోగ్య సంబంధిత సేవలను పొందడంలో వారికి సౌకర్యాలు కల్పిస్తుంది. ఓరల్ రీహైడ్రేషన్ థెరపీ, ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్, క్లోరోక్విన్, డిస్పోజబుల్ డెలివరీ కిట్లు, ఓరల్ పిల్స్‌ఉ కండోమ్లు మొదలైన అన్ని ఆవాసాలకు అవసరమైన అవసరాలను పట్టించుకుంటుంది. గ్రామంలో గర్భిణులను గుర్తించడం. వారి వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదు చేయించడం, ప్రసవం అయ్యేంతవరకు వైద్యపరీక్షలకు తీసుకెళ్లడం, కాన్పు తరువాత టీకాలు వేయించడంలాంటి బాధ్యతలు అప్పగించారు. సమయానికి అందడం లేదు. రికార్డులు, స్టేషనరీ తదితర అత్యవసర ఖర్చులను ఆశాలే పెట్టుకుంటున్నారు,వీటిని ఏనాడూ తిరిగి ఇవ్వడంలేదు. ఒకే జిల్లాలోని ఆశ కార్యకర్తలు సగం మందికి 7వేల రూపాయల పారితోషికాలే అందుతున్నాయి. తమకు నెలకు కనీసవేతనంగా నెలకు 18 వేల రూపాయలు ఇవ్వాలని ఆశ వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం పనితీరునుబట్టి వేతనాలు ఇస్తున్నారని, వాటి ఆధారంగా వేతనాలు ఇవ్వడాన్ని వాళ్లు నిరసిస్తున్నారు. తమకు ఫిక్స్ వేతనాలు ఇవ్వాలని, తమ పరిధిలో వెయ్యి జనాభాఉంటే వారికి సేవలు అందిస్తున్నారు. 5లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగుల వలే ఆరోగ్య కార్డులను అందజేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, ఏఎన్ఎం కోర్సులు చేసిన వారిని ఏఎన్ఎంలుగా నియమించాలని తమను రెగ్యులర్ చేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, డిమాండ్‌చేస్తూ ఆశ కార్యకర్తలు సమ్మె చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో వైద్య సేవలకు ఇబ్బంది ఏర్పడింది.

తెలంగాణా ఏర్పడిన తర్వాత ఆశ వర్కర్లకు మూడుసార్లు పారితోషికాన్ని పెంచి ఇప్పుడు రూ.9,750 ఇస్తున్నామని ప్రభుత్వం అంటున్నది. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ.4 వేల నుంచి రూ.5 వేలు మాత్రమే వారికి ఇస్తున్నారు... దేశంలో ఎక్కడ ఇంత ఇవ్వడం లేదని మంత్రులు అంటున్నారు. డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని ఆశాలు అంటున్నారు.

ఎస్‌వైఎల్ కెనాల్‌పై

పంజాబ్‌లో రాజకీయ రగడ

- రాజ్‌భవన్ వైపు దూసుకెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు
- జల ఫిరంగులతో పోలీసుల అడ్డుకట్ట

చండీగఢ్: సట్లేజ్ యమున లింక్(ఎస్‌వైఎల్) కెనాల్ వివాదంపై పంజాబ్‌లో రాజకీయ రగడ కొనసాగుతోంది. మాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్ వేర్వేరుగా ఆందోళనలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నాయి. తాజాగా కాంగ్రెస్ పార్టీ సోమవారం రాజ్‌భవన్‌కు ప్రదర్శన చేపట్టింది. దీనిని పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను చెల్లాచెదురు చేయడం కోసం పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించారు. రాజ్‌భవన్ వైపు దూసుకుపోతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. పెద్దసంఖ్యలో వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను చెదరగొట్టడానికి పోలీసులు బలప్రయోగానికి దిగారు. తాము గవర్నరు బన్వరిలాల్ పురోహిత్‌ను కలిసి ఎస్‌వైఎల్ కెనాల్ వివాదంపై వినతిపత్రం ఇవ్వాలని తాము కోరుకున్నామని పంజాబ్ కాంగ్రెస్ తెలిపింది. ఆందోళనలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అమరీందర్‌సింగ్ రాజా వారింగ్, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత ప్రతాప్‌సింగ్ బజ్వా, ఎమ్మెల్యే రాణా గుర్జీత్‌సింగ్, మాజీమంత్రి సాధుసింగ్ ధరమ్‌సత్, అసెంబ్లీ మాజీ స్పీకర్ రాణా కేపీ సింగ్, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఆందోళనకారులు గవర్నరు

నివాసానికి వెళ్లకుండా నియంత్రించడానికి పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. బారికేడ్లను తొలగించి గవర్నరు నివాసానికి వెళ్లడానికి కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించారు. వారిని నిలువరించడానికి పోలీసులు వాటర్ క్యానన్‌లు ప్రయోగించారు. కొద్దిసేపటి తర్వాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి బజ్వా మాట్లాడుతూ పంజాబ్ నుంచి ఒక్క చుక్క నీరు కూడా ఇతర రాష్ట్రాలకు వెళ్లడానికి తాము అంగీకరించబోమని స్పష్టంచేశారు. ఇతర రాష్ట్రాలకు నీటిని పంపిణీ చేయడానికి పంజాబ్‌కు అదనపు జలాలు లేవని చెప్పారు. భగవంత్ మాన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ ఎస్‌వైఎల్ వ్యవహారంలో రాష్ట్ర ప్రయోజనాలు పరిరక్షించడంలో పంజాబ్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎస్‌వైఎల్ కెనాల్ వివాదంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడంతో రాష్ట్రానికి సంబంధించిన ఏ సమస్యపైనైనా బహిరంగ చర్చకు రావాలని ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్‌కు ముఖ్యమంత్రి మాన్ ఆదివారం సవాల్ విసిరారు. నదీజలాలకు సంబంధించి రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో ఆప్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ పంజాబ్ బీజేపీ శనివారం ఆందోళన చేసింది. కాలువ నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు మాన్ సర్కార్ సుప్రీంకోర్టుకు తెలిపిందని, అయితే, దీనిని ప్రతిపక్ష పార్టీలు, రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు బీజేపీ పంజాబ్ అధ్యక్షుడు సునీల్ జాకర్ చెప్పారు.

తెలంగాణలో ఒంటరిపోరు: మాయావతి



లక్నో: తెలంగాణ, రాజస్తాన్‌లో తాము ఒంటరిగా పోటీ చేస్తామని, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లో గొండ్వానా గణతంత్ర పార్టీ(జీజీపీ)తో ఎన్నికల పొత్తు ఉంటుందని బీఎస్‌పీ అధినేత్రి మాయావతి సోమవారం ప్రకటించారు. మిజోరం అసెంబ్లీ ఎన్నికల్లో తాము పోటీ చేయడం లేదని చెప్పారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన తర్వాత మాయావతి ఎక్స్ మాధ్యమం వేదికగా స్పందించారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ప్రకటించడాన్ని మాయావతి స్వాగతించారు. ప్రభుత్వ యంత్రాంగం, ధనబలాన్ని నియంత్రించడం ద్వారా ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించడం ఎన్నికల కమిషన్ ముందున్న పెద్ద సవాల్ అని ఆమె పేర్కొన్నారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లో జీజీపీతో తాము పొత్తు పెట్టుకుంటున్నట్లు ప్రకటించారు. రాజస్తాన్, తెలంగాణలో ఒంటరిగా పోటీ చేస్తామని, ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్లు మాయావతి తెలిపారు. ఎన్నికలను ప్రభావితం చేసేలా పాలక పార్టీలు ప్రజలను మభ్యపెట్టేందుకు ఇచ్చే హామీలను కట్టడి చేయాల్సిన అవసరం ఉందని మాయావతి స్పష్టంచేశారు. కులతత్వం, మతతత్వం, హింసకు కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో చత్తీస్‌గఢ్‌లో బీఎస్‌పీ 35 మందిని రంగంలోకి దింపింది. అందులో ఇద్దరు విజయం సాధించారు. మధ్యప్రదేశ్‌లో 227 మందిని పోటీ చేయించగా అందులోనూ ఇద్దరు గెలిచారు. రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో 190 మంది పోటీ చేయగా ఆరుగురు గెలుపొందారు. అయితే, 2019లో బీఎస్‌పీ ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణలో 106 మందిని పోటీకి దించగా ఒక్కరూ విజయం సాధించలేదు.

మణిపూర్ హైకోర్టు సీజే నియామకానికి త్వరలో నోటిఫికేషన్

సుప్రీం కోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూదిల్లీ: మణిపూర్ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిని నియమించేందుకు త్వరలో ఒక నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని కేంద్ర ప్రభుత్వం సోమవారం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఆ పదవికి దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి సిద్దార్థ మృదుల్‌ను సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసిన మూడు నెలలకు పైగా కాలం తర్వాత కేంద్రం దీనిపై స్పష్టత ఇచ్చింది. న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, సుధాన్షు దులియాతో కూడిన ధర్మాసనానికి ఈ విషయం తెలిపింది. న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సుధాన్షు ధులియా ధర్మాసనానికి సమర్పించిన పత్రంలో 14 మంది హైకోర్టు న్యాయమూర్తుల బదిలీలకు సంబంధించిన ఫైళ్లను జాబితా చేశామని, మిగిలిన 12 మంది ప్రక్రియలో ఉన్నారని కేంద్రం తెలిపింది. న్యాయమూర్తుల నియామకం, బదిలీల కోసం కొలీజియం సిఫారసు చేసిన పేర్లను జాబితా చేయడంలో కేంద్రం జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ దాఖలయిన పిటిషన్‌తో సహా రెండు పిటిషన్లను సుప్రీం కోర్టు విచారించింది. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని అత్యున్నత న్యాయస్థానం కొలీజియం జులై 5న దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిద్ధార్థ్ మృదుల్‌ను మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సిఫారసు చేసింది. సోమవారం విచారణ సందర్భంగా ధర్మాసనం కొన్ని 'సానుకూల పరిణామాలను' ప్రస్తావించింది. ఇప్పటివరకు న్యాయ మంత్రిత్వ శాఖ వద్ద పెండింగ్‌లో ఉండి సుప్రీం కోర్టు కొలీజియంకు పంపని హైకోర్టుల సిఫార్సులు పెద్ద సంఖ్యలో ఎట్టకేలకు చేరాయని పేర్కొంది. హైకోర్టులు చేసిన సిఫారసులపై కన్సల్టీ న్యాయమూర్తుల అభిప్రాయాలను ఇప్పుడు సుప్రీం కోర్టు కొలీజియం సేకరిస్తుంది. ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని ధర్మాసనం తెలిపింది. 26 మంది హైకోర్టు న్యాయమూర్తులబదిలీపై ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ, '14 కేసుల్లో ఫైళ్లు జాబితా అయ్యాయి. త్వరలో నోటిఫికేషన్లు జారీ అవుతాయి. మిగిలిన 12 మందికి సంబంధించి ప్రక్రియలో ఉంది' అని పేర్కొంది. 'గణనీయమైన సమయం పెండింగ్‌లో ఉన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియామకానికి సంబంధించి, అది కూడా సున్నితమైన రాష్ట్రానికి సంబంధించి, ఫైల్ జాబితా అయిందని, త్వరలో నోటిఫికేషన్ జారీ అవుతుందని తెలిపిందని' అది పేర్కొంది. 'తదుపరి తేదీ నాటికి, నేను దీన్ని పూర్తి చేయాలనుకుంటున్నాను. నేను చాలా చాలా మర్యాదగా ఉన్నాను. నన్ను మర్యాదగా ఉండనివ్వండి' అని జస్టిస్ కౌల్ వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను అక్టోబరు 20కి ధర్మాసనం వాయిదా వేసింది. కొలీజియం వ్యవస్థ ద్వారా న్యాయమూర్తుల నియామకం తరచుగా సుప్రీం కోర్టు, కేంద్రం మధ్య ప్రధాన వివాదంగా మారింది. సెప్టెంబరు 26న ఈ వ్యాజ్యాన్ని విచారణ చేస్తున్నప్పుడు న్యాయమూర్తుల నియామకంలో 'జాప్యం' పై అత్యున్నత న్యాయస్థానం విస్మయం వ్యక్తం చేసింది. సమస్యను పరిష్కరించడానికి తన మంచి కార్యాలయాలను ఉపయోగించాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని కోరింది. 2021 తీర్పులో కోర్టు నిర్దేశించిన కాలక్రమాన్ని పాటించడం లేదని ఆరోపిస్తూ కేంద్ర న్యాయ, న్యాయ మంత్రిత్వ శాఖపై ధిక్కార చర్యలు తీసుకోవాలని అడ్వకేట్స్ అసోసియేషన్ బెంగళూరు దాఖలు చేసిన పిటిషన్‌తో సహా సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది.

బిల్కిస్ బానో కేసు పిటిషన్లపై

రేపు సుప్రీంలో తుది విచారణ

న్యూదిల్లీ: బిల్కిస్ బానో సామూహిక అత్యాచారం కేసులో 11 మంది దోషులను ముందుగా విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్లపై తుది విచారణను సుప్రీం కోర్టు సోమవారం అక్టోబరు 11కు వాయిదా వేసింది. 2002 గుజరాత్ అల్లర్ల సమయంలో ఆమె కుటుంబ సభ్యులు ఏడుగురు హత్యకు గురయ్యారు. 'మేము పిటిషన్లను బుధవారం విచారణ చేస్తాము' అని న్యాయమూర్తులు బి.వి. నాగరత్న, ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంటూ, అదే రోజు విచారణను ముగించడానికి ప్రయత్నిస్తుందని తెలిపింది. పిటిషనర్ల లిఖితపూర్వక సమర్పణలను స్వీకరించామని, వాటిని రికార్డుల్లోకి తీసుకున్నామని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 'అక్టోబరు 11, 2023న మధ్యాహ్నం 2 గంటలకు జాబితా చేయండి' అని దోషులను ముందస్తుగా విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తున్న వారి ప్రతిస్పందనలు వినడానికి షెడ్యూల్ ధర్మాసనం తెలిపింది. కాగా, బిల్కిస్ బానోతో సహా పిటిషనర్ల తరపు న్యాయవాదిని తమ చిన్న లిఖితపూర్వక స్పందనను దాఖలు చేయాలని ధర్మాసనం అక్టోబరు 6న కోరింది. సెప్టెంబరు 20న ఈ వ్యాజ్యాన్ని విచారణ చేస్తున్నప్పుడు దోషులకు ఉపశమనం కోరే ప్రాథమిక హక్కు ఉందా అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. 'ఉపశమనం కోరే హక్కు ప్రాథమిక హక్కేనా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 (తమ ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తే నేరుగా సుప్రీం కోర్టును ఆశ్రయించే పౌరుల హక్కుకు సంబంధించినది) కింద పిటిషన్ ఉంటుందా' అని 11 మంది దోషుల్లో ఒకరి తరపున హాజరయిన న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. ఉపశమనం కోరడం దోషుల ప్రాథమిక హక్కు కాదని న్యాయవాది అంగీకరించారు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ దాఖలు చేయడం ద్వారా బాధితుడు, ఇతరులకు నేరుగా సుప్రీం కోర్టును ఆశ్రయించే హక్కు కూడా లేదు. ఎందుకంటే వారి ప్రాథమిక హక్కు కూడా ఉల్లంఘించబడలేదు. ఉపశమనం కోరడానికి బాధితులకు ఇతర చట్టబద్ధమైన హక్కులు ఉన్నాయని వాదించాడు. ఆగస్టు 17న వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం దోషులకు ఉపశమనం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఎంపిక చేయరాదని, ప్రతి ఖైదీకి సమాజాన్ని సంస్కరించే, తిరిగి కలిసే అవకాశం కల్పించాలని పేర్కొంది. గుజరాత్ ప్రభుత్వం తమకు మంజూరు చేసిన ఉపశమనానికి వ్యతిరేకంగా బిల్కిస్ బానో దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, సీపీఎం నాయకురాలు సుభాషిణి అలీ, స్వతంత్ర పాత్రికేయురాలు రేవతి లాల్, లక్నో విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ రూప్ రేఖా వర్మ సహా అనేక ఇతర ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా కూడా దోషులను ముందుగా విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. గోద్రా రైలును తగలబెట్టిన ఘటన తర్వాత చెలరేగిన మత ఘర్షణల సమయంలో 21 ఏళ్ల బిల్కిస్ బానో ఐదు నెలల గర్భిణి. ఆమెపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆ అల్లర్లలో తన మూడేళ్ల కుమార్తెతో పాటు ఏడుగురు కుటుంబ సభ్యులు హత్యకు గురయ్యారు.

సిక్కింలో సహాయ చర్యలు ముమ్మరం

- రంగంలోకి సైన్యం, వైమానిక దళం
- 60కి పెరిగిన మృతులు

గ్యాంగ్‌టక్: సిక్కింలోని తీస్తా నదికి ఇటీవల సంభవించిన మెరుపు వరదల కారణంగా 60 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికీ 105 మంది ఆచూకీ తెలియరాలేదు. వారి కోసం సహాయ బృందాలు గాలిస్తున్నాయి. వైమానికదళం కూడా రంగంలోకి దిగింది. 1,655 ఇళ్లు ధ్వంసం కాగా నాలుగు జిల్లాల్లో 14 వంతెనలు కొట్టుకుపోయాయి. కాగా తీస్తా నది నుంచి తాము ఇప్పటి వరకు 40 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్టు పశ్చిమబెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లా అధికారులు తెలిపారు. వీటిలో ఇప్పటి వరకు 10 మృతదేహాలను గుర్తించారు. ఒక్క సిక్కింలోనే 26 మంది మృతి చెందారు. మృతుల్లో 10మంది సైనికులు కూడా ఉన్నారు. మరోవైపు, ఉత్తర సిక్కింలోని లాచెన్, లాచుంగ్, తంగు, చుంగ్తాంగ్ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన 63 మంది విదేశీయులు సహా 1,700 మంది పర్యాటకులను రక్షించేందుకు సైన్యం రంగంలోకి దిగింది. వారికి ఆహారం, వైద్య సహాయం, కమ్యూనికేషన్ సౌకర్యం కల్పిస్తున్నారు. వాతావరణం ప్రతికూలంగా ఉండడంతో వారిని సురక్షితంగా తరలించడంలో జాప్యం జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్...సాయుధ బలగాలతో సహాయ చర్యలను సమన్వయం చేసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పాఠక్, చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ మనోజ్ పాండే, ఇతర అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. విధ్వంసం ఎంత మేరకు జరిగిందనే విషయాన్ని ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీమ్ సభ్యులకు పాఠక్ వివరించారు. సిక్కింలో నమోదైన 34 మరణాలలో, పాక్యోంగ్ జిల్లాలో అత్యధికంగా 10 మంది సైనిక సిబ్బందితో సహా 22 మంది మరణించారు. గ్యాంగ్‌టక్‌లో ఆరు మరణాలు, మంగన్‌లో నాలుగు, నామ్చిలో రెండు మరణాలు నమోదయ్యాయి. సిక్కిం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకారం ఇంకా 105 మంది ఆచూకీ తెలియరాలేదు. భారత వైమానిక దళం సిక్కింలో మానవతా సహాయం, విపత్తు సహాయక చర్యలను ప్రారంభించింది. హెలికాప్టర్ ద్వారా లాచెన్ నుంచి మంగన్ వరకు చిక్కుకుపోయిన పర్యాటకుల్లో మొదటి బృందాన్ని విజయవంతంగా రక్షించారు. అయితే వీరు ఎంతమంది ఉంటారనేది తెలియరాలేదు. అయితే ఆపరేషన్‌లో ఉపయోగించిన ఎంఐ-17 హెలికాప్టర్ 25-30 మందిని రవాణా చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. అదనంగా, 77 మంది పర్యాటకులను ఎంఐ-17 , చినూక్ హెలికాప్టర్‌ల ద్వారా లాచుంగ్ నుండి పాక్యోంగ్ విమానాశ్రయానికి తరలించారు. అక్కడి నుంచి వారిని బస్సుల్లో పొరుగున ఉన్న పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురికి పంపారు. భారత వైమానిక దళం ఈ కార్యకలాపాలను ఎయిర్ ఫోర్స్ స్టేషన్ బాగ్డోగ్రా నుండి ప్రారంభించింది.

సైన్యం కూడా సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటోంది. వరదల సమయంలో ఎక్కువగా ప్రభావితమైన చుంగ్తాంగ్ నుంచి ఉత్తర సిక్కింకు కనెక్టివిటీని పునరుద్ధరించడంపై వారు దృష్టి సారించారు. భారత సైన్యం ఒక సవాలుతో కూడిన ఆపరేషన్‌ను చేపట్టింది. చుంగ్తాంగ్‌కు వాయువ్యంగా ఉన్న రాబోమ్ అనే మారుమూల గ్రామానికి చేరుకున్నాయి. అక్కడ ప్రస్తుతం 150-200 మంది పౌరులను రక్షించే పని జరుగుతోంది. వాతావరణం అనుకూలించడంతో సోమవారం నుంచి పర్యాటకుల గాలింపు, రక్షణ చర్యలు ముమ్మరమయ్యాయి. కాగా రానున్న ఐదు రోజుల్లో పశ్చిమ బెంగాల్, సిక్కింలలో ఉరుములు మరియు మెరుపులతో కూడిన తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ప్రజాస్వామ్య హంతకులకు గుణపాఠం: కమల్‌నాథ్

భోపాల్: ప్రజాస్వామ్య విఘాతకులకు మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కమల్‌నాథ్ స్పష్టంచేశారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. నవంబరు 17న ఒకే విడతలో పోలింగ్ జరుగుతుంది. డిసెంబరు 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. షెడ్యూల్ విడుదల అనంతరం కమల్‌నాథ్ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోసం రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని, ప్రజాస్వామ్య హననానికి పాల్పడిన బీజేపీకి ప్రజలు గుణపాఠం చెబుతారని, రాష్ట్రంలో వాస్తవిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. 2020 మార్చి 15న తన నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కుప్పకూల్చిన విషయాన్ని కమల్‌నాథ్ ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన 15 మాసాలకే తన ప్రభుత్వాన్ని కూల్చారని, జ్యోతిరాదిత్య సింధియా నాయకత్వంలో అనేకమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినట్లు వివరించారు. తర్వాత సింధియా కేంద్రమంత్రి అయ్యారన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని బీజేపీ దారుణంగా కూల్చివేసిందని, ప్రజాస్వామ్యాన్ని చిదిమేసిందని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలకు కమల్‌నాథ్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా కమల్‌నాథ్ మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ఎదుర్కొంటున్నారు.

సొరేన్ సర్కార్‌కు ఎన్‌సీపీ బెదిరింపు

రాంచి: జార్ఖండ్‌లోని హేమంత్ సొరేన్ సంకీర్ణ ప్రభుత్వానికి ఎన్‌సీపీ ఏకైక ఎమ్మెల్యే కమలేశ్ సింగ్ డెడ్‌లైన్ విధించారు. అక్టోబరు 31వ తేదీనాటికి పాలమూ జిల్లాలోని హుస్సేనాబాద్ సబ్ డివిజన్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయకపోతే ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటానని కమలేశ్ సింగ్ సోమవారం హెచ్చరించారు. హుస్సేనాబాద్ ఎమ్మెల్యే కమలేశ్ విలేకరులతో మాట్లాడుతూ హుస్సేనాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలన్న షరతు మేరకు 2020లో సొరేన్ ప్రభుత్వానికి తమ పార్టీ మద్దతిచ్చిందని, ఆ హామీ ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. జేఎంఎం-కాంగ్రెస్-ఆర్‌జేడీ ప్రభుత్వం అక్టోబరు 31 నాటికి హుస్సేనాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించకపోతే నవంబరు 1వ తేదీన ప్రభుత్వానికి తాను మద్దతు ఉపసంహరించుకుంటానని కమలేశ్ సింగ్ స్పష్టంచేశారు. జార్ఖండ్‌లో అజిత్ పవార్ వర్గానికి చెందిన ఎన్‌సీపీకి తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానని సింగ్ చెప్పారు. అజిత్‌పవార్ వర్గం కేంద్రంలో ఎన్‌డీఏకు మద్దతిస్తున్న విషయం విదితమే. ప్రజల ఆకాంక్షల మేరకే తాను జార్ఖండ్ ప్రభుత్వానికి మద్దతు కొనసాగిస్తున్నానని, అయితే, ప్రజల కలలు పరిపూర్తి చేయడంపై ప్రభుత్వం ఎంతమాత్రం శ్రద్ధ వహించడం లేదని ఆరోపించారు. ఇప్పటికే నాలుగేళ్లు గడిచిపోయాయని, అయినా హుస్సేనాబాద్, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఇసుక ఘాట్లకు ప్రభుత్వం ఇప్పటికీ టెండర్లు పిలవలేదని మండిపడ్డారు.

చే గువేరా స్ఫూర్తితో ముందుకు: విజయన్

తిరువనంతపురం: సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాల నిర్మాణం కోసం క్యూబా విప్లవవీరుడు చే గువేరా ప్రాణాలర్పించారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కొనియాడారు. చే గువేరా 56వ వర్ధంతిని పురస్కరించుకొని విజయన్ ఆయనకు నివాళి అర్పించారు. చే గువేరా స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా విముక్తి ఉద్యమాలు ఎగిసిపడ్డాయని విజయన్ తెలిపారు. చే ఆశయాలను ముందుకు తీసుకెళదామని పేర్కొంటూ రేపటి భవిష్యత్ కోసం కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ విప్లవ పోరాటవీరులకు చే గువేరా స్ఫూర్తిప్రధాత అని మంత్రి ఎంబీ రాజేశ్ పేర్కొన్నారు. ఆయన త్యాగాల స్ఫూర్తితో సోషలిస్టు సమాజం వైపు అడుగులేద్దామని ఆకాంక్షించారు. సీపీఎం కూడా చే గువేరా వర్ధంతి సందర్భంగా సామాజిక మాధ్యమం వేదికగా నివాళి అర్పించింది.

ఆ మూడు రాష్ట్రాల్లో పోటీకి ఆప్ సిద్ధం: కేజ్రీవాల్

న్యూదిల్లీ: త్వరలో జరగనున్న మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ సిద్ధంగా ఉందని... అభ్యర్థుల పేర్లను త్వరలో ప్రకటిస్తామని ఆ పార్టీ జాతీయ కన్వీనర్, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం తెలిపారు. మిజోరాం, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించిన క్రమంలో ఎన్నికలకు ఆప్ సన్నద్ధత గురించి అడిగిన ప్రశ్నపై కేజ్రీవాల్ స్పందిస్తూ... "రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ ఎన్నికల్లో పూర్తి స్థాయిలో పోటీ చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము' అని చెప్పారు. అయితే ఆప్... ఇండియా కూటమిలో భాగంగా ఎన్నికల్లో పోటీ చేస్తుందా అని అడగ్గా... "ఏం జరిగినా అది తెలియజుయబడుతుంది" అని కేజ్రీవాల్ అన్నారు. చత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉంది. ప్రతిపక్ష ఇండియా కూటమిలో కాంగ్రెస్‌తో పాటు ఆప్ కూడా భాగస్వామిగా ఉంది.

5 రాష్ట్రాలలో 'ఇండియా' కూటమిదే విజయం: ఆదిత్య ఠాక్రే

ముంబై: వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల ప్రజలు ఇండియా కూటమికి పట్టం కట్టడం ఖాయమని శివసేన (యూబీటీ) నాయకుడు ఆదిత్య ఠాక్రే విశ్వాసం వ్యక్తం చేశారు. కుల మతాల మధ్య చీలికలు సృష్టించి, రాజ్యాం గాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ దేశాన్ని దెబ్బతీసే వారికి భారత ప్రజలు ఓటు వేయరని ఆయన పేర్కొన్నారు. దేశంలో శాంతి, ప్రజా శ్రేయస్సు, అభివృద్ధికి భరోసా ఇచ్చిన ప్రతిపక్ష ఇండియా కూటమికి ప్రజలు పట్టం కడతారని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్నికల సంఘం... మహారాష్ట్రలోని పూణె, చంద్రపూర్ లోక్‌సభ స్థానాల ఉప ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిందా అని ఠాక్రే ప్రశ్నించారు. పూణె, చంద్రపూర్‌లకు ఆరు నెలలుగా లోక్‌సభలో ప్రాతినిధ్యం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో బీజేపీ ఎంపీ గిరీష్ బాపట్ మృతి చెందడంతో పూణె లోక్‌సభ స్థానం ఖాళీ అయింది. చంద్రపూర్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ సురేష్ ధనోర్కర్ ఈ ఏడాది మేలో మరణించారు. ఈ రెండు లోక్‌సభ నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

బాణసంచా ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

9 మంది మృత్యువాత

అరియలూర్: తమిళనాడులోని అరియలూర్ జిల్లాలో ఒక బాణసంచా ఫ్యాక్టరీలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించి కనీసం 9 మంది మరణించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ప్రమాదంలో మరణించిన వారికి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వారి కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. జిల్లాలోని విరగలూరు గ్రామంలో ఒక ప్రైవేట్ యూనిట్‌లో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. గాయపడిన ఐదుగురిని తంజావూరు వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్పించినట్లు, వారికి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రమాదానికి సంబంధించి తక్షణ సహాయక, ఉపశమన చర్యలను పర్యవేక్షించేందుకు తన మంత్రివర్గ సభ్యులు ఎస్.ఎస్.శివశంకర్, సి.వి.గణేశన్‌ను నియమించినట్లు స్టాలిన్ చెప్పారు. మృతుల కుటుంబాలు ఒక్కొక్కరికి రూ.3 లక్షలు, తీవ్ర గాయాలైన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించారు.

కృష్ణా జలాల పునఃపంపిణీపై

బీజేపీ కుట్ర రాజకీయాలు తిప్పికొడతాం

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడలేని వైసీపీ

కడప కలెక్టరేట్ వద్ద అఖిలపక్ష నేతల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-కడప: కృష్ణా జలాల పున:పంపిణీపై మోదీ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని వైసీపీ, బీజేపీ మినహా అన్ని పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. రాష్ట్రంలో ఉద్యమాలు సాగిస్తున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి కోసమే కృష్ణా జలాల పున:పంపిణీపై కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసిందని నాయకులు విమర్శించారు. కేంద్రం నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం కలిగిస్తుందని మండిపడ్డారు. కేంద్రం నిర్ణయాన్ని అడ్డుకోలేని వైసీపీ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. వైసీపీ ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాజకీయ కుట్రలను ఎండగడతామని, నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కృష్ణా జలాలపై బీజేపీ కుట్రలకు నిరసనగా అఖిలపక్షం అధ్వర్యంలో కడప కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన జరిగింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, టీడీపీ రాష్ట్ర నాయకులు జి.లక్ష్మిరెడ్డి, ఆర్‌సీపీ నాయకులు ఎన్.రవిశంకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నేత సత్తార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు డబ్ల్యూ. రాము, సీపీఐ ఎంఎల్ నేతలు రమణయ్య, దస్తగిరి రెడ్డి, రైతు రాజ్యం నేత గురప్ప, ఎంఆర్‌పీఎస్ నేత నరసింహులు మాట్లాడారు. అంతర్ రాష్ట్ర నదీ వివాదాల చట్టం 1956 ప్రకారం కృష్ణానది నీటి వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ మొత్తం కృష్ణా నీటిని 2130 టీఎంసీలుగా లెక్క గట్టి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీలు, మహారాష్ట్రకు 525 టీఎంసీలు, కర్నాటకకు 734 టీఎంసీలు కేటాయించిందని, మిగులు జలాలు వాడుకునే వెసులుబాటును దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు కల్పిస్తూ తీర్పు చెప్పిందని నాయకులు వివరించారు. కేంద్రం తాజా నిర్ణయంతో మిగులు జలాలపై ఆధారపడి నిర్మిస్తున్న గాలేరు నగరి, హంద్రీనీవా, వెలుగొండ, తెలుగుగంగ ప్రాజెక్టుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనున్నదని ఆరోపించారు. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పుపై సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ వ్యాజ్యం దాఖలు చేసిందని, ఈ కేసు విచారణలో ఉండగానే మోదీ ప్రభుత్వం కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అడ్డగోలు నిర్ణయాలు చేసి అందలమెక్కాలని చూస్తున్నదని విమర్శించారు. కర్నాటక ఎన్నికల సమయంలో ఎగువ భద్రత ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చిందని, ఇప్పుడు తెలంగాణ ఎన్నికల వేళ కృష్ణా జలాల తేనెతుట్టె కదిపిందని మండిపడ్డారు. మరోవైపు కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు బచావత్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ కేటాయింపుల ప్రకారం తాము ముందుగానే వినియోగించుకునేందుకు అవసరమైన ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలని వాదిస్తున్నాయన్నారు. నాలుగు రాష్ట్రాల మధ్య ఉన్న నీటి సమస్యను రెండు రాష్ట్రాలకే పరిమితం చేసి సగం వాటా కావాలన్న తెలంగాణ ప్రభుత్వ డిమాండ్‌ను మోదీ ప్రభుత్వం రెండు రాష్ట్రాలకే పరిమితం చేసిందని విమర్శించారు. బీజేపీ రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాలను ఎదుర్కోవడంలో సీఎం జగన్ పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాయలసీమ ప్రయోజ నాలను బీజేపీకి తాకట్టు పెడుతున్న జగన్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యంవీ సుబ్బారెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, వీరశేఖర్, ఏఐటీయూసీ నేత ఎల్.నాగ సుబ్బారెడ్డి, జి.వేణుగోపాల్, కేసి బాదుల్లా, వెంకట్ రాముడు, నాయకులు మునయ్య, మిడుతూరు ప్రసాద్, నాగేశ్వరరావు, రవికుమార్, పిడుగు మస్తాన్, బాల ఓబయ్య, బ్రహ్మం, మల్లికార్జున, మనోహర్ బాబు, భాగ్యలక్ష్మి, మైనుద్దీన్, మనోహర్ రెడ్డి, కట్టా యానాదయ్య, బాల చంద్రయ్య, చంద్రశేఖర్ రెడ్డి, సంజీవ్, చంద్ర, అరుణ్, తేజ, పాల్గొన్నారు. కృష్ణానది జలాల పునః పంపిణీ జరిగితే రాయలసీమ రైతాంగానికి ఆత్మహత్యలే శరణ్యమంటూ సీపీఐ పోరుమామిళ్ల శాఖ అధ్వర్యంలో ఉరితాళ్లను మెడకు కట్టుకొని వినూత్న నిరసన తెలిపారు.



చే స్ఫూర్తిప్రదాత: రాజా

న్యూఢిల్లీ: క్యూబా విప్లవయోధుడు చే గువేరా స్ఫూర్తిప్రదాత అని ఆయన వర్ధంతి సందర్భంగా సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా కొనియాడారు. చే జీవితం, ఆయన చేసిన పని ఎంతగానో ప్రభావితం చేస్తుందన్నారు. మానవాళిపై ప్రేమ వాస్తవం అయ్యేంత వరకు నిత్య పోరాటం మనకు తప్పదన్న ఆయన మాటలను రాజా గుర్తుచేశారు. మెరుగైన ప్రపంచం కోసం పోరాడేందుకు స్ఫూర్తినిచ్చారంటూ శ్లాఘించారు. 'మోకరిల్లి బతకడం కంటే నిల్చుని ప్రాణాలు వదలడం మిన్న' అన్న చే మాటలతో కూడిన ఆయన చిత్రపటాన్ని పోస్టు చేయడం ద్వారా రాజా నివాళులర్పించారు.

భారతీయుల భద్రతకు చర్యలు తీసుకోండి

జైశంకర్‌కు వినయ్ విశ్వం లేఖ

న్యూఢిల్లీ: ఇజ్రాయిల్‌లో చిక్కుకున్న భారతీయులు సురక్షితంగా స్వదేశానికి రాగలిగేందుకు ఏర్పాట్లు చేయాలని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్ జైశంకర్‌ను సీపీఐ ఎంపీ వినయ్ విశ్వం కోరారు. భారతీయుల భద్రత, రక్షణ విషయంలో జోక్యం చేసుకోవాలనే అంశమై ఆయన సోమవారం ఓ లేఖ రాశారు. పౌరుల భద్రత గురించి తొలుత ఆలోచన చేయకుండా ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటనకు సర్కార్ తొందరపడటం భారతీయులను బాధించిందని విశ్వం పేర్కొన్నారు. ఇజ్రాయిల్, హమాస్‌కు మధ్య భీకర పోరు జరుగుతున్న వేళ భారత్ పౌరులు అనేకమంది అక్కడ చిక్కుకుపోయి ఉన్నారని, వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకు రావాలని వినయ్ విశ్వం కోరారు. ఈ అంశాన్ని తేలికగా తీసుకోవద్దని సూచించారు. పలస్తీనా ప్రజల గౌరవ జీవనం, న్యాయబద్ధ ప్రయోజనాలకు మద్దతు ఇచ్చే భారత సంప్రదాయానికి కొనసాగించాలన్నారు. పలస్తీనాలో మానవహక్కుల పరిరక్షణకు, శాశ్వత శాంతి స్థాపనకు కట్టుబడాలని కోరారు. ఐరాస తీర్మానాల ప్రకారం టూస్టేట్స్ పరిష్కార మార్గాన్ని అనుసరించేలా కృషిచేయాలని వినయ్ విశ్వం సూచించారు.

బీసీ జన గణన చేపట్టండి: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: బీసీల పట్ల జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఏపీలో బీసీ జనగణన చేపట్టాలనీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ జనగణనకు గత శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసిందని గుర్తు చేశారు. బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెబుతున్న ముఖ్యమంత్రి జగన్‌కు నిజంగా వారి పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఇంతవరకు రాష్ట్రంలో బీసీ జనగణన చేయకపోవడంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. బీహార్‌లో బీసీ జనగణనను పూర్తి చేసి, సమగ్ర వివరాలను వెల్లడించారని చెప్పారు. జగన్ పాలన కక్ష సాధింపులకే పరిమితమైందని ఆరోపించారు. ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయించడంలోనే జగన్ నిమగ్నమయ్యారని విమర్శించారు.

క్లాప్ ఏజెన్సీ నిర్వాహకులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలలో స్వచ్ఛ సర్వేక్షన్ కింద తీసుకొచ్చిన క్లాప్ విధానం కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురిపించేదిగా ఉందే తప్ప కార్మికులకు ప్రజలకు అందివ్వాల్సిన సౌకర్యాలు ఏ మాత్రం లేవని, క్లాప్ ఏజెన్సీ దారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. స్థానిక గొల్లపూడిలోని రాష్ట్ర కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆసుల రంగనాయకులు అధ్యక్షతన క్లాప్ డ్రైవర్ల రాష్ట్ర సదస్సు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ 2022 అక్టోబరు 2న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన క్లాప్ విధానంలో పని చేస్తున్న కార్మికులకు... ఆయా కాంట్రాక్టర్లు మున్సిపాలిటీలు చెల్లిస్తున్న వేతనాలను చెల్లించకుండా అరకొర వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. ఒక క్లాప్ ఆటోకు ఒక డ్రైవర్, ఒక క్లీనర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటే ఆ మేరకు ప్రభుత్వంతో అగ్రిమెంట్లు చేసుకున్నప్పటికీ కేవలం ఒక డ్రైవర్‌ను మాత్రమే నియమిస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీలు చెల్లిస్తున్న రూ.12 వేల వేతనాన్ని అందివ్వకుండా రూ.8 వేలు, రూ.10 వేలు అంటూ ఇష్టానుసారంగా వేతనాలు చెల్లిస్తున్నారని అన్నారు. అవి కూడా మూడు నెలలకు ఒక మారు ఇచ్చే పరిస్థితి నెలకొందన్నారు. వేతనాల గురించి కార్మికుడు అడిగితే నిర్లక్ష్యంగా సెటిల్మెంట్ పేరుతో వారిని ఇంటికి సాగనంపుతున్నారని విమర్శించారు. ఒక క్లాప్ ఆటో నిర్వహణకు మున్సిపాలిటీల నుంచి రూ.63 వేలు తీసుకున్న ఏజెన్సీ వారు రిపేర్లు కూడా కార్మికుల జీతాల్లో నుంచే వసూలు చేస్తూ దందా చేస్తున్నారని, వీరిపైన క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. శాశ్వత కార్మికునికి కనీస వేతనం రూ.18,500 ఇవ్వకుండా ఎగ్గొడుతున్నారని, ఈ కాంట్రాక్టర్ల దెబ్బకు కార్మికులు బెంబేలెత్తిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా క్లాప్ విధానాన్ని ఫ్లాప్ చేసిన ఏజెన్సీలను రద్దు చేసి, పని చేస్తున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని, వారికి సాంఘిక భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన ఆప్కాస్ విధానం ఉండగా మధ్యలో ఈ ఏజెన్సీల వ్యవహారం ఏమిటని సీఎం జగన్‌ను ప్రశ్నించారు. కార్మిక చట్టాలు, ప్రభుత్వ అగ్రిమెంట్లు అమలు చేయని ఈ ఏజెన్సీలపై ముఖ్యమంత్రికి ఎందుకంత ప్రేమనో తేటతెల్లం చేయాలని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించి కార్మికుని శ్రమను గౌరవించాలని ఆయన ప్రభుత్వానికి హితవు పలికారు. ప్రజల నుంచి వసూలు చేసిన చెత్త పన్ను తదితర పన్నుల నుంచి ఆయా మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య సేవలకు గాను క్లాప్ నిర్వహకులకు చెల్లిస్తున్న 63 వేల రూపాయలను ఏజెన్సీలు జేబుల్లో వేసుకుంటుంటే కమిషనర్లు కమిషన్ల కక్కుర్తి పడుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. స్థానికంగా రాజకీయ నాయకుల ఒత్తిళ్ల కార్మికులపై పెరిగిపోతున్నా కార్మిక శాఖ చర్యలు తీసుకోకపోవడం క్షమించలేని నేరం అన్నారు. తక్షణం క్లాప్ డ్రైవర్లకు గుర్తింపు కార్డులు, యూనిఫామ్ ఇవ్వాలని, విధుల్లో భద్రత కల్పించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఏఐటీయూసీ ఆందోళనకు దిగవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ సదస్సులో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ పొడుగు రామకృష్ణ, కో కన్వీనర్లు జగన్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్-పలస్తీనా యుద్ధంపై

ఒమర్ అబ్దుల్లా, ముఫ్తీ ఆందోళన

శ్రీనగర్: ఇజ్రాయిల్-పలస్తీనా యుద్ధంపై నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో పరిస్థితి వీలైనంత త్వరగా సాధారణ స్థితికి తీసుకురావాలని వీరు ఆకాంక్షించారు. 'జమ్మూకశ్మీర్‌లో లేదా మరెక్కడైనా... హింస ఎక్కడ జరిగినా, అంతిమంగా బాధితులు అమాయకులే. వీలైనంత త్వరగా పరిస్థితి సాధారణ స్థితికి చేరుకోవాలని మేము ఆశిస్తున్నాము, ప్రార్థిస్తున్నాము' అని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. అయితే ఇజ్రాయిల్‌కు నొప్పి కలిగినప్పుడు మాత్రమే ప్రపంచదేశాలు మేల్కొనడం దురదృష్టకరమని ముఫ్తీ అభిప్రాయపడ్డారు. 'ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి చేసిన తర్వాతనే నేడు పాశ్చాత్య ప్రపంచం మేల్కొంది. దశాబ్దాలుగా ఇజ్రాయిల్ పలస్తీనాలో దురాగతాలకు పాల్పడుతోంది... వృద్ధులు, యువకులు, మహిళలు, పిల్లలు ఇలా ఎంతోమంది ప్రజలు చంపబడ్డారు. కానీ ప్రపంచం దాని గురించి మౌనంగా ఉంది' అని మెహబూబా అన్నారు.

రాజకీయ ప్రతీకార నిరోధానికే '17ఏ'

- చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై సుప్రీంలో సుదీర్ఘ వాదనలు
- విచారణ నేటికి వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో సీఐడీ తనపై నమోదుచేసిన అక్రమ కేసును కొట్టివేయాలని కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో జస్టిస్ అనిరుద్ధబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదితో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాదులు హరీష్‌సాల్వే, అభిషేక్ మను సింఘ్వీ, సిద్ధార్థ లూథ్రా ఏపీ ప్రభుత్వం తరపున ముకుల్ రోహత్గీ, రంజిత్‌కుమార్ వాదనలు వినిపించారు. ఈ పిటిషన్‌పై ఈ నెల 3న రెండు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం హైకోర్టు ముందు దాఖలుచేసిన పత్రాలను తమకు సమర్పించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసిన విషయం తెల్సిందే. దీంతో సోమవారం మళ్లీ వాదనలు కొనసాగాయి. చంద్రబాబు తరపున హరీశ్ సాల్వే వాదనలు వినిపిస్తూ... " సెప్టెంబర్ 19న హైకోర్టు తీర్పు రిజర్వు చేయగా రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 20న కొన్ని డాక్యుమెంట్లను కోర్టు ముందు ఉంచింది. 19న వాదనలు పూర్తయి తీర్పు వాయిదావేశాక 20న వాటిని కోర్టు ముందు పెట్టింది. 2018లో నేరం జరిగిందన్న వివరాలేవీ రిమాండ్ రిపోర్టులో పేర్కొనలేదు. 2021లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగానే రిమాండ్ రిపోర్టు ఉంది. దాని ఆధారంగా మేం చెప్పదలచుకుంది 17ఏ వర్తిస్తుందనే. 1959 ఎస్‌ఈఆర్ 191 కేసు జడ్జిమెంట్ ప్రకారం చట్టసవరణకు ముందు కేసులకు కూడా వర్తిస్తుంది" అని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. "మంచి, చెడు అనేది పక్కన పెడితే హైకోర్టు డేట్ ఆఫ్ అఫెన్స్‌ను పరిగణనలోకి తీసుకుంది. డేట్ ఆఫ్ ఎఫ్ఐఆర్ పరిగణనలోకి తీసుకోవాలని మా వాదన. గౌరవనీయమైన కోర్టు దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. 17ఏ అనేది డేట్ ఆఫ్ ఎఫ్ఐఆర్ వర్తిస్తుందా లేదా డేట్ ఆఫ్ అఫెన్స్ కింద వర్తిస్తుందా అనేది కోర్టు ముందుంచాం. నేరుగా నగదు తీసుకుంటూ పట్టుబడితే తప్ప మిగిలిన అన్నింటికి 17ఏ వర్తిస్తుంది. అవినీతి నిరోధక శాఖ చట్టం ప్రకారం కేసు పెడితే ఈ పాటికే మాకు ఉపశమనం లభించేది" అని సాల్వే వాదించారు. దీనిపై జస్టిస్ బేలా ఎం.త్రివేది స్పందిస్తూ రిమాండ్ ఆర్డర్‌నే చాలెంజ్ చేస్తున్నారా? అని ప్రశ్నించగా అవును రిమాండ్ ఆర్డర్‌నే చాలెంజ్ చేస్తున్నామని ధర్మాసనానికి హరీశ్ సాల్వే నివేదించారు. అనంతరం విచారణను సుప్రీంకోర్టు మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేసింది. భోజన విరామం అనంతరం తిరిగి వాదనలు ప్రారంభమయ్యాయి. 2018లోనే విచారణ ప్రారంభమైందంటూ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముకుల్ రోహత్గీ చేసిన వాదనలను ఈ సందర్భంగా జస్టిస్ బేలా ఎం.త్రివేది ప్రస్తావించారు. అనంతరం హరీశ్ సాల్వే వాదిస్తూ రోహత్గీ వాదనే సహేతుకం కాదని, ఎఫ్ఐఆర్‌కు దారితీసిన విచారణ అదికాదని చెప్పారు. గతంలో ఏదో విచారణ జరిగిందని, దాన్ని మూసేశారని చెప్పారు. ఆ తర్వాత కొత్త విచారణ ప్రారంభించారని తెలిపారు. దానికి సంబంధించిన డాక్యుమెంట్లు ఎక్కడున్నాయి? హైకోర్టు వాటిని పరిశీలించిందా? అని జస్టిస్ బేలా ఎం.త్రివేది ప్రశ్నించగా అసలు సమస్యంతా అక్కడే ప్రారంభమైందని సాల్వే చెప్పారు. అయితే విచారణ ఎప్పుడు ప్రారంభమైందని జస్టిస్ అనిరుద్ధబోస్ ప్రశ్నించగా ఆ ఫిర్యాదుతో పిటిషనర్‌కు సంబంధమే లేదని సాల్వే వెల్లడించారు. "డిజైన్ టెక్, స్కిల్ టెక్ మధ్య జీఎస్టీకి సంబంధించిన ఫిర్యాదు ఇది. డిజైన్ టెక్, సీమెన్స్ సొమ్ము తరలించారన్న ఆరోపణలకు సంబంధించిందని తెలిపారు. మరోవైపు ఒప్పందం ఎవరితో జరిగిందని జస్టిస్ బేలా ఎం.త్రివేది ప్రశ్నించగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం జరిగిందని సాల్వే సమాధానమిచ్చారు. అన్నీ పరిణామాలను పరిశీలిస్తే.. కేసు నమోదు, ఫిర్యాదు విచారణ అన్నీ కూడా 2021లోనే జరిగాయి. జూన్ 2018లో ఎఫ్ఐఆర్ లేదు.. విచారణే లేదు. 2021 సెప్టెంబర్ 7న ఫిర్యాదు ఆధారంగా ప్రాథమిక విచారణ ప్రారంభమైంది. 2018 జులైకు ముందు జరిగిన నేరాలకు 17ఏ వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం వాదనగా ఉంది. దాని ఆధారంగానే 2018కి ముందే నేరం జరిగినందున 17ఏ వర్తించదని ప్రభుత్వం వాదనగా ఉంది. ఆరోపణలన్నీ 2015, 2016కు సంబంధించినవి కాబట్టి ఇప్పటి విచారణలో పరిగణనలోకి తీసుకోలేమని హైకోర్టు భావించింది. వీటన్నింటినీ మేము కోర్టు ముందు ఉంచుతున్నాం. ఫిర్యాదు, విచారణ అన్నీ 2021లో ఉన్నాయి. కాబట్టి 17ఏ వర్తిస్తుందని కోర్టుకు విన్నవిస్తున్నాం. కేసులో ఎప్పుడు ఏం జరిగింది.. వివరాలేంటి అనే దానిపై ఇప్పుడు మేము ప్రస్తావించట్లేదు. కేసులో ఉన్న వాస్తవాలపై రాష్ట్ర ప్రభుత్వం మసిపూసే ప్రయత్నం చేసింది. రిమాండ్ ఆర్డర్ స్పష్టంగా 2021లో జరిగిన ప్రాథమిక విచారణ ఆధారంగానే కేసు నమోదు చేసినట్లు ఉంది" అని సాల్వే వివరించారు. రాజకీయ ప్రతీకార చర్యలు లేకుండా ఉండడం కోసం, గత ప్రభుత్వాలపై వేధింపులు లేకుండా ఉండేందుకే చట్టసవరణ జరిగి 17ఏ అమలులోకి వచ్చిందని పేర్కొన్నారు. 17ఏ అమలుపై కేంద్ర ప్రభుత్వం స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్‌ను రాష్ట్రాలకు జారీ చేసిందని... పబ్లిక్ సర్వెంట్లపై ఆరోపణలు చేయాలంటే తప్పనిసరిగా అధీకృత అధికారి నుంచి సమ్మతి అవసరమని స్పష్టం చేశారు. ఉద్యోగులనైనా, ప్రజాప్రతినిధులైనా ఎలాంటి పద్ధతి ఫాలో కావాలన్న దానిపై ఎస్ఓపీలో పేర్కొన్నారని... ప్రతీకార చర్యలకు పాల్పడిన సందర్భాలు ఉన్నందునే చట్టానికి సవరణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 17ఏ ప్రకారం ప్రజాప్రతినిధులపై ఏ తరహా విచారణ చేయాలన్నా పోలీసులు అనుమతులు పొందాల్సిందేనని హరీశ్ సాల్వే బలంగా వాదించారు. ప్రభుత్వ తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ దీనిపై మంగళవారం తమ వాదనలు వినిపించడానికి అనుమతి ఇవ్వాలని కోరగా సుప్రీం ధర్మాసనం అనుమతి ఇస్తూ 10వ తేదీకి విచారణను వాయిదా వేసింది.

ఐఆర్ఆర్ కేసులో మరో నలుగురు

– సీఐడీ తాజాగా మరో పిటిషన్ దాఖలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో సీఐడీ సోమవారం మరో పిటిషన్ దాఖలు చేసింది. సీఐడీ అధికారులు ఈ కేసులో కొత్తగా మరో నలుగురిని నిందితులుగా చేర్చారు. మాజీ మంత్రి పి.నారాయణ సతీమణి రమాదేవితో పాటు ప్రమీల, ఆవుల మణిశంకర్, రాపూరి సాంబశివరావును నిందితులుగా చేర్చారు. వారిపై ఐపీసీ 120బి, 409, 420, 34, 35, 37, 166, 167 రెడ్ విత్ 13(2) పి.ఒ.సి చట్టంలోని 13(1)(సి)(డి) సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఈ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ అధికారులు దాఖలు చేశారు. ఇప్పటికే అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆయన విచారణకు హాజరుకానున్నారు. కాగా ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా నేడు ఆ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పును వెలువరించింది. అటు హైకోర్టు తీర్పును వెలువరించిందో లేదో, ఇటు సీఐడీ ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో మరికొందరి పేర్లను చేర్చుతూ మరో పిటిషన్ దాఖలు చేసింది.

ఇన్నేళ్లు శాంతి గుర్తురాలేదా...

- హింస జరగడం ఇదే మొదటిసారన్నట్లు నటన తగదు
- సామ్రాజ్యవాదులపై టర్కీ కమ్యూనిస్టు పార్టీ అసహనం
- న్యాయమైన పోరాటంలో పలస్తీనా ప్రజల గెలుపు తథ్యమని ప్రకటన

ఇస్తాంబుల్: న్యాయమైన పోరాటంలో పలస్తీనా ప్రజలు తప్పక గెలుస్తారని టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) విశ్వాసం వ్యక్తం చేసింది. పలస్తీనాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ వారి భూములను హరిస్తూ మారణహోమం సృష్టించేటప్పుడు గుర్తుకు రాని శాంతి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని సామ్రాజ్యవాద అనుకూల వర్గాలను టీకేపీ కేంద్ర కమిటీ నిలదీసింది. ఈ ప్రాంతంలో ఇప్పుడే హింస జరిగినట్లు నటన మానుకోవాలని సూచించింది. పలస్తీనా ప్రజలది న్యాయమైన పోరాటమని, వారు తప్పక గెలుస్తారని... సామ్రాజ్యవాదులు, దురాక్రమణదారులకు ఓటమి తప్పబోదని ఇజ్రాయిల్, హమాస్ మధ్య యుద్ధంపై తాజా ప్రకటనలో వ్యాఖ్యానించింది. గాజా నుంచి ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా మొదలైన ఆపరేషన్ క్రమంలో ఇజ్రాయిల్ ప్రభుత్వానికి అనుకూలంగా ప్రచారానికి కొదవలేదని వ్యాఖ్యానించింది. బూర్జువా మీడియా, సామ్రాజ్యవాద అనుకూల కేంద్రాలు హింసకు వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తూ ఒక దాని తర్వాత ఒకటిగా సందేశాలు వెలువరిస్తూ అమాయకత్వాన్ని నటిస్తున్నాయని దుయ్యబట్టింది. 'ఇదేదో ఆకస్మికంగా జరిగినదన్నట్లుగా నటన ఆపండి. ఈ ప్రాంతంలో కొత్తగా హింస జరిగినట్లుగా ప్రవర్తించడం సముచితం కాదు' అని టీకేపీ వ్యాఖ్యానించింది.

'పలస్తీనా ప్రజలు దశాబ్దాలుగా వ్యూహాత్మక క్రూరత్వాన్ని, అణచివేతను అనుభవి స్తున్నారు. వారి భూములను ఇజ్రాయిల్ సైన్యం, సెట్లర్లు కబ్జా చేశారు. దశాబ్దాలుగా పలస్తీనా ప్రజలు సంచార జీవుల్లా బతుకుతున్నారు. దీనిని ప్రతిఘటిస్తే వివక్ష పేరిట ఉసిగొల్పిన హింసకు బలిచేస్తారు. భూమిపైనే కాకుండా గగనతలం నుంచి దాడులు చేస్తూ ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేసి పలస్తీనాను నాశనం చేయాలని విఫలప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో భాగంగా ఇజ్రాయిల్‌కు ఆత్మరక్షణ హక్కు నెపంతో పలస్తీనా ప్రజల ఊచకోతను, మారణహోమాన్ని సమర్థించిన కొందరు సామ్రాజ్య వాద వర్గీయులు... పలస్తీనా ప్రజలు తమ ప్రతిఘటనను తీవ్రతరం చేసిన వెంటే శాంతి సందేశాలు ఇస్తున్నారు. ఇప్పటివరకు వారికి శాంతి గుర్తుకు రాలేదా?'అని టీకేపీ అసహనం వ్యక్తం చేసింది.

'అవును! నిజమే... ఈ ప్రాంతానికి నిజమైన శాంతి ఎంతో అవసరం. ప్రాణ నష్టం ఎంతన్నది కాదు ఈ సమస్య పరిష్కారం కావడం కోసం శాంతి నెలకొల్పడం ముఖ్యం. సామ్రాజ్యవాదుల కపటత్వాన్ని నమ్మతూ ఈ విషయంలో కమ్యూనిస్టుల నిబద్ధతను ప్రశ్నించడం తగదు. సామ్రాజ్యవాదులు మానవ జీవితానికి విలువ లేదనట్లుగా పలస్తీనా విషయంలో వ్యవహరించారు. తమ విషయంలో మాత్రం భిన్నంగా స్పందిస్తున్నారు. తాజా పరిణామాలకు ఇజ్రాయిలీ ఆక్యుపేషన్ విధానమే కారణమని ధైర్యంగా చెప్పడం ఇజ్రాయిల్ కమ్యూనిస్టుల గౌరవాన్ని పెంచింది. వారి సాహసం విలువైన పాఠాన్ని నేర్పుతోంది. పలస్తీనా ప్రజలు వారి మనుగడ కోసం, స్వతంత్ర, సార్వభౌమ పలస్తీనా ఏర్పాటు కోసం పోరాడుతున్నారు. పలస్తీనా ప్రజల పోరాటం న్యాయమైనది. ఈ పోరాట ఫలం కచ్చితంగా శాంతి అవుతుంది. సామ్రాజ్యవాదులు, కబ్జాదారులకు ఓటమి తప్పదు. న్యాయమైన పోరాటంలో పలస్తీనా ప్రజల గెలుపు తథ్యం' అని టర్కీ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ పేర్కొంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.